


Licenced to Post without Prepayment (PMG/VJ/PWPP/17/2009-11)

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు స్థాపితం: 1930 జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి

Longest Living Newspaper in Telugu Journalism

సమీక్షణం

సంపుటి: 81 • సంచిక: 34 • 20-8-2010 శుక్రవారం • పేజీలు: 16 • విడి ప్రతి: రూ.5/-



ప్రధాని పరువు నిలిపిన

టి.సుబ్బరామరెడ్డి



అణు జవాబుదారీ చట్టాన్ని ఆమోదింపజేయడంలో అద్భుత చాణక్యం ప్రదర్శించాడు.

కొంత మంది పదవులలోకి వచ్చి రాణిస్తారు. మరికొందరు పదవులకే రాణింపు తెస్తారు. రాజ్యసభ సభ్యుడు టి.సుబ్బరామరెడ్డి ఈ రెండవ కోవకు చెందిన వాడిగా పరిణితి సాధించారు. అణు జవాబుదారీ చట్టాన్ని ఆమోదింపచేయడంలో ఆయన చూపిన రాజనీతిజ్ఞత, రాజకీయ లౌక్యం, వ్యవహార దక్షత జాతీయ నేతలందరి అభినందన లకు పాత్రమైంది.

కొరవ 14వ పేజీలో

అయోమయంలో జగన్

ఏ దారి ఎంచుకొన్నా నష్టమే తప్ప లాభం వుండదు.

రాష్ట్ర కాంగ్రెస్‌తో జగన్ గొడవ చివరి అంకానికి చేరుకొన్నది. అటో ఇటో తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. సెప్టెంబర్ 3తేది నుంచి ఆయన తల పెట్టిన ప్రకాశం, నెల్లూరుజిల్లా ఓదార్పు యాత్ర పట్ల అధిష్టానం తన అభ్యంత రాలను స్పష్టంగా విశదం చేసింది. ఎమ్పీ లకు, ఎమ్మెల్యేలకు తేటతెల్లంగా ఆదే శాలు జారీ చేసింది. యాత్రకు పోతే మీ పని అంతే అని కుండబద్దలు కొట్టింది. ప్రకాశం జిల్లాలో ఓదార్పు యాత్రకు ఆ జిల్లా మంత్రి, వైఎస్ సమీప బంధువు బాలినేని శ్రీనివా సులురెడ్డి సన్నాహాలు చేస్తున్నాడు. ఎమ్మె ల్యేలను పిలిపించి సమావేశాలు నిర్వ హించాడు. తమ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ మొత్తం జగన్‌తోనే వున్నదన్న అభి ప్రాయం కల్పించడానికి ప్రయత్నం చేశాడు. ఈ వార్తలు అధిష్టానానికి చిరాకు పుట్టించాయి. అదే జిల్లాకు చెందిన కేంద్రమంత్రిణి పనబాక లక్ష్మి దగ్గర రుసరుసలాడారు సోనియా గాంధీ. పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో ఎదురుపడిన పనబాకను దగ్గరకు పిలిచి ఓదార్పు యాత్రకు వెళ్తున్నావా అని అడి గారట సోనియా. దానికామె, లేదని సమాధానం చెప్పింది. మీ భర్త సంగ తేమిటని మళ్లీ అడిగారట. వెళ్లడం లేదని చెప్పిందట. ఆ మాటకు సోనియాకు

కొరవ 14వ పేజీలో



Dr. I. Gopal Reddy

Congratulations

to

Dr. I. Gopal Reddy

Former Vice - Chancellor,
J.N.T.U., Hyderabad.
Chairman, N.B.K.R.I.S.T. Vidyanagar



Sri. N. Ram Kumar
Correspondent

On his being conferred with Honorary Doctorate
by Jawaharlal Nehru Technological University, Ananthapur
in recognition of his commendable services to the
cause of Technical Education.

Wishing him Many More Laurels

Correspondent, Staff & Students
N.B.K.R. Institute of Science & Technology
Vidyanagar.

అవినీతి వరద

ఎపీఐఐసీ భూకేటాయింపులో జరిగిన, జరుగుతున్న అవినీతి పరిమాణం చూస్తే గుండెలు పగిలిపోతున్నాయి. పారిశ్రామికులకు కావలసిన భూమిని సేకరించి పెట్టడానికి ఎపీఐఐసీని ఒక పావుగా వాడుకోవడం చంద్రబాబునాయుడు హయాంలో మొదలైంది. ఆ తర్వాత వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి దాన్ని విశృంఖలం చేశాడు. హైదరాబాదు నగరంలో ఐటి పార్కులు, గోల్ఫ్ కోర్స్‌లు, కోస్తా తీరంలో ఓడరేవులు, థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులు, స్పెషల్ ఎకనామిక్ సముదాయాలు, పెట్రో కారిడార్లు, ఫార్మా వాటికలు, ఇనుప ఖనిజం గనులు... ఇట్లా ఒక టేమిటి ఎక్కడ ఎవరికి భూమి అవసరమైనా ఎపీఐఐసీని రంగంలోకి దించడం అలవాటైపోయింది. మనకు తెలిసినంత వరకు గత అరవై యేళ్లలో ప్రభుత్వం భూమి సేకరించడం రెండంటే రెండు ప్రయోజనాలకు పరిమితమై వుండేది. పేదలకు ఇళ్లు కట్టించాలనుకున్నప్పుడు లేదా నీటి పారుదల ప్రాజెక్ట్‌ల వంటివి నిర్మించదలచినప్పుడు భూసేకరణకు పూనుకొనేది ప్రభుత్వం. కానీ చంద్రబాబునాయుడు, వైఎస్‌లు ఇద్దరూ ప్రైవేట్ వ్యక్తుల నుంచి భూమి సేకరించడమనే దుష్ట సాంప్రదాయాన్ని విచ్చలవిడిగా నడిపించారు. ఈ క్రమంలో ప్రభుత్వమే చేసిన ఎన్నో చట్టాలను లెక్కలేకుండా ఉల్లంఘిస్తున్నారు. భూసంస్కరణల చట్టం, పర్యావరణ పరిరక్షణ చట్టం, కోస్తాతీర ప్రాంతం నియంత్రణ చట్టం, మడచెట్ల పరిరక్షణ చట్టం, వ్యవసాయ భూముల పరిరక్షణ చట్టం, అడవుల పరిరక్షణ చట్టం, గిరిజనుల హక్కుల పరిరక్షణ చట్టం వంటివి ఎన్నో వీరిద్దరి పాలనలో నిర్వీర్యమైపోయాయి. పారిశ్రామిక అభివృద్ధి జరగాలంటే భూమి కావాలి కాబట్టి, పారిశ్రామికులకు దాన్ని సమకూర్చి పెడుతున్నామని వివరణ ఇవ్వడం పాలకులకు అలవాటు. పారిశ్రామిక అభివృద్ధి ప్రకృతి విధ్వంసంగా, పేద ప్రజల పాలిట శాపంగా మారకూడదన్న విచక్షణ ఇద్దరిలోనూ లేదు.

మరొక ప్రక్క ఈ భూసేకరణ అవినీతికి ఆలవాలంగా మారిపోయింది. భూసేకరణలో పేదవాడికి, రైతుకు ఇచ్చే మొత్తానికి రెట్టింపుగా లంచాల రూపంలో అధికారులకు, ముఖ్యమంత్రులకు చేరడం ఒక ఆనవాయితీగా మారింది. నెల్లూరు, విశాఖపట్నం వంటి జిల్లాలలో భూసేకరణ జరిపినప్పుడు ఎకరాకు ఐదు నుంచి పది లక్షల వరకు వైఎస్‌రాజశేఖర్‌రెడ్డికి లంచంగా ఇచ్చామని బహిరంగంగానే చెప్తున్నారు పారిశ్రామికులు. హైదరాబాద్ నగరంలో ఈ మొత్తం ఆయా భూముల విలువను బట్టి ఎకరాకు కోటి నుంచి ఐదు కోట్ల వరకు వుందన్న మాట వాస్తవం. ప్రపంచంలోని ఏ దేశాధినేత కూడా, చివరకు ఉగాండా వంటి ఆఫ్రికా దేశపు ఆటవిక రాజ్యాలలో కూడా ఇంత భారీ అవినీతి లేదు. గత ఐదారేళ్లలో కేవలం పరిశ్రమలకు ఇచ్చిన భూమి మీదనే యాభై అరవై వేల కోట్ల రూపాయలు లంచాలుగా చేతులు మారాయని అంచనా.

ఇటువంటి అవినీతికర అంశాలలో ప్రభుత్వము, పాలకపక్షము కుమ్మక్కై ఎవరి వాటాలు వారు పంచుకొని పారిశ్రామికులకు కొమ్ము కాయడం వల్లనే ఇది నిరంతరాయంగా కొనసాగుతున్నది. ప్రతిపక్షంతోపాటు లోక్‌సత్తా వంటి ప్రజా సంఘాలు, పత్రికా యాజమాన్యాలు, చివరకు కమ్యూనిస్టు పార్టీలు కూడా పారిశ్రామికులతో లోపాయకారీ సంబంధాలు పెట్టుకొంటున్నాయి. అవినీతి వరద ప్రజల కళ్లలో పడకుండా చేతులు అడ్డం పెడుతున్నాయి. ఇప్పుడు కూడా కాంగ్రెస్‌లోని అంతర్గత విబేధాల వల్ల ఎపీఐఐసీ పేరుతో జరిగిన అవినీతి రచ్చకెక్కుతున్నది తప్ప ప్రతిపక్షమో, లోక్‌సత్తావంటి ప్రజా సంఘాలో వెలికి తీయడం వల్ల కాదు. ఈ దుర్మార్గాన్ని నివారించాలంటే ఇప్పటివరకు ఈ రూపంలో జరిగిన అవినీతి కార్యక్రమాల మొత్తం మీద సమగ్ర దర్యాప్తు జరిపించాలి. ఎమర్జెన్సీ కాలంలో వేసినట్లు విచారణ కమీషన్లు నియమిస్తే తప్ప, ప్రత్యేక న్యాయస్థానాలు, ప్రత్యేక దర్యాప్తు సంస్థలు ఏర్పాటు చేస్తే తప్ప ఇంత భారీ అవినీతి వెలికి తీయడం, దోషులను నిర్ధారించడం అలివయ్యే పని కాదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మీద ఆ మేరకు ఒత్తిడి తెచ్చి, సమగ్ర దర్యాప్తు సాధించడం ప్రజాసంఘాల కర్తవ్యం. లేకుంటే ఇప్పటివరకు భూములు, గనులు మాత్రమే అమ్ముకొన్న రాజకీయవాదులు రేపటి నుంచి దేశాన్ని, రాష్ట్రాన్ని టోకున అమ్మకానికి పెట్టేస్తారు.

జమీన్‌రైతు

జనవాక్కు

చిరంజీవి ఏ పార్టీ?

చిరంజీవి వీరాభిమానుల్లో నేనొకడిని. ఆయన ప్రజారాజ్యం పార్టీ పెడుతున్నట్లు ప్రకటించగానే ఎంతగానో సంతోషించాను. తిరుపతిలో పార్టీ ప్రకటన సందర్భంలో పెద్ద పెద్ద వాగ్దానాలు చేశాడు. కానీ ఆయన పార్టీ తరపున ఎన్నికల్లో అభ్యర్థులు పోటీ చేయను టిక్కెట్లు అమ్ముకొన్నాడన్న నిందమోయక తప్పలేదు. కాంగ్రెస్‌ను తెగతిట్టిన ఆయన రాజ్యసభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీతో ప్రత్యేకచర్చలు జరిపివచ్చాడు. మొన్న నెల్లూరు పర్యటనలో జగన్‌ను తిట్టి అవసరమైతే రోశయ్య ప్రభుత్వానికి మద్దతు ప్రకటిస్తానన్నాడు. రంగడి గుడిలో వివేకాను ఆలింగనం చేసుకొన్నాడు. ప్రెస్‌క్లబ్‌లో నటించాలని వుందన్నాడు. గందరగోళంగా వున్న చిరంజీవి తన పార్టీ ఏమిటో? దాన్ని ఎన్నాళ్లు వుంచుతాడో ప్రకటిస్తే బాగుంటుంది.

వాస్తు రామచంద్ర, నెల్లూరు

ఐఎఎస్ అధికారిని స్పెషల్ ఆఫీసర్‌గా వేయాలి!

నెల్లూరు నగర కార్పొరేషన్ పాలకవర్గం పదవీ కాలం మరో నెల రోజులలో ముగుస్తుంది. ఎన్నికలు ఇప్పటికిప్పుడే జరిగే పరిస్థితి లేదు. అప్పటివరకు ఒక యువ ఐఎఎస్ అధికారిని నగర కార్పొరేషన్‌కు స్పెషల్ ఆఫీసర్‌గా నియమించాలి. నగర కార్పొరేషన్ ప్రజల ఆరోగ్యాన్ని పారిశుధ్యాన్ని గాలికి వదిలేసింది. దోమల బెడదతో ప్రజలు నానా బాధలు పడుతున్నారు. రాజకీయ విమర్శలు సాగించి చేతులు దులుపుకోవటం రాజీవ్ భవన్‌కు ఇష్టంలేకనే గత ఆరు నెలలుగా ప్రత్యేక స్కావెంజర్లను నియమించి మురికిగుంటల్లో ఆయిల్ బాల్స్ వదలడం తోపాటు కిరోసిన్ చల్లుతున్నాము. ఆయిల్స్‌బాల్స్ అవసరమైన ప్రజలు రాజీవ్‌భవన్‌లో సంప్రదించవచ్చు.

కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నెల్లూరు

పొట్టిశ్రీరాములు జిల్లాగా పిలవడం లేదు!

ఇప్పటి ముఖ్యమంత్రి రోశయ్యగారి కృషి వల్ల దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి గారు శాసనసభలో బిల్లు ప్రవేశపెట్టి జిల్లా పేరును పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లాగా 2008వ సంవత్సరంలో మార్చారు. కానీ ఆచరణలో మాత్రం అందరూ నెల్లూరుజిల్లానే అంటున్నారు. ఇలా అనకుండా వుండాలంటే కడపజిల్లాను వైఎస్ఆర్ జిల్లాను చేసినట్లు మనజిల్లాను పొట్టిశ్రీరాములు

కొరవ 14వ పేజీలో

70 ఏళ్ల క్రితం ఈవారం

23-8-1940
పేజీలు : 16 వెల: అణా

నెల్లూరు ముచ్చట్లు

దొంగతనమా? దొరతనమా??

నెల్లూరు పెన్నానది రైల్వేబ్రిడ్జి మీద ఏటికి నీరు వచ్చినప్పుడు మనిషికి 1కి 0–1–0లు వసూలు చేసి వందల కొలది జనాన్ని వదల్తున్నారు.

ఇది ప్రయాణీకులకు తాత్కాలిక లాభమైనా చాలా అపాయకరమైనది దీన్ని మేమే కాదు ఎవ్వరూ చూసి సహించరు.

ఇది రైల్వే పై అధికారులకు తెలిసి జరిగేదో? కాదో? మాకు తెలియదు.

పోలీసువారైనా ఈ దఫా నీళ్లు వచ్చినపుడు యిలాంటి అపాయకర ప్రయాణాన్ని అరికడతారని మా ఆశయం.

ఆందోళన చేసి ఏటికి నీరు వచ్చినప్పుడు వెంటనే లోకల్ ట్రెయిన్ వేసే ఏర్పాటుచేయడం చాలా అవసరం.

ఒక సంశయం

ప్రభుత్వ నౌకరులు సర్టిఫికేట్ల నిమిత్తం వెళ్లితే ప్రపంచం మీద డిఎంఓలకు గాని, వారి ఆఫీసు గుమాస్తాలకు గాని కట్నాలు చెల్లించవలసిన అవసరం వుందా? అని ఒక సంశయగ్రస్తుడు అడుగుతున్నాడు? ఈ బాపులు పబ్లీకు లంచం క్రిందకు వస్తాయని మా అభిప్రాయం. ఈ లాంటిదే లోకంలోనన్నా వుంటే ఈ ప్రశ్నకుడు బైటబెడితే పబ్లీక్కు ఉపకారం జేసినవాడౌతాడని గూడ మా సలహా!

50 ఏళ్ల క్రితం ఈవారం

19-8-1960
పేజీలు: 12 వెల: 0-20 న.పై

గూడూరు స్టేషన్‌లో రాష్ట్రపతి!

రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ తన మదరాసు రాష్ట్ర పర్యటన ముగించుకొని ఢిల్లీకి వెడలిపోతూ, ఈ నెల 16వ తేది సాయంత్రం ఆరు గంటలకు గూడూరు రైల్వేస్టేషన్‌లో 10 నిమిషాలసేపు ఆగారు.

సాయంత్రం 6గంటల రెండు నిముషాలకు సరిగ్గా తన స్పెషల్ రైలులో అంగరక్షకులు వెంటరాగా రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ గూడూరు స్టేషన్ ప్లాట్‌ఫారంలో దిగారు. బాబు రాజేంద్రప్రసాద్ తన సహజ దుస్తులను– గాంధీ టోపి లేకుండా, ఖద్దరు లాల్చీ, ధోవతిని మాత్రమే ధరించి వుండిరి. రాష్ట్రపతి రైలు దిగగానే వెయ్యిమంది వాకాడు హాస్టల్ విద్యార్థులు 'నమస్తే'తో స్వాగతం చెప్పారు. నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి, వాకాడు హాస్టల్ అనాధ విద్యార్థి రామదాసు, గూడూరు ఛైర్మన్ పొన్నలూరు కోటారెడ్డి రాష్ట్రపతిని పుష్పమాలాంకృతులను గావించారు.

14వ స్వాతంత్ర్యదినోత్సవం

భారత స్వాతంత్ర్య 13వ వార్షికోత్సవం నెల్లూరు పట్టణంలో జయవహంగా జరిగింది. పట్టణంలోని స్కూళ్లు, హాస్టళ్లు వగైరా అనేక సంస్థలు తమ కార్యాలయాలపై జాతీయ పతాకములనెగురవేశాయి.

15తేది ఉదయం 9 గంటలకు నెల్లూరు జిల్లా కలెక్టరు కె.నటరాజన్ పోలీసు మైదానంలో జాతీయ పతాకమును ఆవిష్కరించి రిజర్వు పోలీసు వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వి. నటరాజన్ తెలుగులో ప్రసంగిస్తూ దేశప్రజలంతా ఐక్యంగా నిలబడాలని వుద్బోధించారు. అధివక్త నేలనూతల కృష్ణమూర్తి, న్యాయవాది మాడభూషి సుందరాచారి గారలు ఉపన్యసిస్తూ భారత స్వాతంత్ర్యవీరులను సంస్మరించి, కొన్ని స్వాతంత్ర్య పోరాట సన్నివేశాలను వివరించారు.

నెల్లూరు ముచ్చట్లు

ఎస్పీకి ఇండియన్ పోలీస్ మెడల్!

పోలీస్ శాఖలో అత్యుత్తమ సేవా పతకం ఇండియన్ పోలీస్ మెడల్‌ను నెల్లూరు ఎస్పీ ఈతముక్కల దామోదర్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. స్వాతంత్ర్య దినోత్సవం రోజు ఈ మెడల్‌ను హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రోశయ్య చేతుల మీదుగా అందుకోవాల్సి వుంది. నెల్లూరులో ఎఎస్పీ లేక పోవడంతో ఇక్కడి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో తప్పనిసరిగా పాల్గొనవలసి వుండడంతో అక్కడకు వెళ్లి ఈ మెడల్‌ను తీసుకోలేక పోయారు. ఎస్పీ స్వస్థలం శ్రీకాళహస్తి. 1987లో నిజామాబాద్ డిఎస్పీగా పోలీస్ శాఖలో ప్రస్థానం ప్రారంభించిన ఆయన గుంటూరు, విశాఖపట్నం, కర్నూల్‌లలో డిఎస్పీగా ప్రతిభావంతంగా పనిచేశారు. నెల్లూరు, కర్నూల్‌లలో ఎసిబి డిఎస్పీగా పనిచేసిన అనుభవముందాయనకు. హైదరాబాద్‌లో అడిషినల్ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేసే సమయంలో ఐఎస్ఐ తీవ్రవాదుల కదలికలు పసిగట్టి వారిని అణచి వేశారు. విఐపి సెక్యూరిటీ వింగ్ ఎస్పీగా, టిటిడి విజిలెన్స్ ఎస్పీగా, రంగారెడ్డి జిల్లా ఎస్పీగా ప్రతిభావంతంగా పనిచేశారు. హైదరాబాద్‌లోనే క్రైమ్ డిసిపిగా రౌడీల పీచమణిచారు. ఈ సేవలన్నీ గుర్తించి ఈ యేడాది జనవరి 26వ తేదీన కేంద్ర ప్రభుత్వం ఆయనకు ఇండియన్ పోలీస్ మెడల్ ప్రకటించింది. పోలీస్ శాఖలో 23 ఏళ్ల సర్వీసుతో ఇండియన్ పోలీస్ మెడల్‌ను సాధించిన అరుదైన ఘనతను పొందిన ఎస్పీగారికి మా అభినందనలు.

దొంగల పనిపట్టిన సుధాకర్‌కు మెడల్!

నెల్లూరు సెంట్రల్ క్రైం స్టేషన్‌లో ఎఎస్ఐ సుధాకర్‌కు ఈ యేడాది కేంద్ర ప్రభుత్వం ఇండియన్ పోలీస్ మెడల్‌ను ప్రకటించింది. ఆగష్టు 15వ తేది హైదరాబాద్‌లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి రోశయ్య చేతుల మీదుగా దీన్ని అందుకొన్నారు. విడవలూరు మండలం చౌకచర్లకు చెందిన సుధాకర్ 1975లో పోలీసు శాఖలో కానిస్టేబుల్‌గా చేరారు. క్రైం విభాగంలోనే ఎక్కువగా పనిచేసిన ఈయన జిల్లాలో జరిగిన పలు దొంగతనాల కేసులు ఛేదించి కోట్లాది రూపాయలు రికవరీ చేశారు. 225 రివార్డులు, 14 ప్రశంసాపత్రాలు, రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ సేవాపతకాన్ని ఇదివరలోనే సుధాకర్ సాధించారు. క్రైం విభాగంలో ఇదివరలో ఇండియన్ పోలీస్ మెడల్ సాధించిన ఇన్స్‌పెక్టర్లు ఆర్.నాగేశ్వర రావు, షరీఫ్‌లతో కలసి పలు కేసులను సుధాకర్ ఛేదించాడు.

నెల్లూరులో శ్రీకృష్ణ కమిటీ!

రాష్ట్ర విభజనపై జనాభిప్రాయ సేకరణలో భాగంగా పర్యటిస్తున్న శ్రీకృష్ణ కమిటీ జిల్లాలో ఉదయగిరి, కావలి తీర ప్రాంత గ్రామాలు తీపనూరు, జట్లకొండూరులలో కమిటీ పర్యటన కొనసాగిస్తుంది. పూర్తి వివరాలను వచ్చేవారం ముచ్చటించుకొందాం.

ఎస్పీకి డూప్!

మనిషిని పోలిన మనుషులుండడం సహజం. నెల్లూరు ఎస్పీ ఈత ముక్కల దామోదర్, వన్‌టౌన్ ఎస్ఐ మంగారావులను ఖాకీ దుస్తులలో చూస్తే ఒకేలా అనిపిస్తారు. కాస్త పరీక్షగా చూస్తే వీరిద్దరు ఒకరు కాదని తెలుస్తుంది. పోలీస్‌శాఖలో అవసరమైతే ఎస్పీకి డూప్‌గా మంగారావును వాడుకోవచ్చు.

పెన్నా బ్యారేజి పనులు పూర్తి చేయించండి!

నెల్లూరులో పెన్నా బ్యారేజి పనులు తక్షణం చేపట్టేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిటీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధర్‌కృష్ణారెడ్డి 17వ తేది జాయింట్ కలెక్టర్ సౌరభ్‌గౌర్‌ను కలసి వినతిపత్రం సమర్పించారు. ఈ బ్యారేజి నిర్మాణం చేపట్టాలని ప్రజారాజ్యం పార్టీ అధినేత చిరంజీవి ధర్నా చేసిన విషయాన్ని వినతిపత్రంలో గుర్తు చేశారు. జాయింట్ కలెక్టర్‌ను కలసిన వారిలో ఆ పార్టీ నాయకులు ముక్కాల ద్వారకానాథ్, నన్నేసాహెబ్, ఖాజామొహిద్దీన్ తదితరులున్నారు.

జగన్‌కు జై అంటున్న ప్రసన్న

కోవూరు శాసనసభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి వైఎస్ జగన్ వైపే తానుంటానని 17వ తేది పంచేడులో ప్రకటించాడు. జగన్ నెల్లూరు ఓదార్పు యాత్రలో ఆయన వెన్నంటి వుంటానని చెప్పారాయన.

వాళ్లు తాగుబోతులు!

బెల్ట్‌షాపులను వ్యతిరేకిస్తూ తెలుగుదేశం పార్టీ మహిళా విభాగం 16వ తేది నెల్లూరులో జరిపిన మహా ప్రదర్శన, బహిరంగసభను రూరల్ ఎమ్మెల్యే వివేకానందరెడ్డి తన సహజ ధోరణిలో ఎగతాళి చేస్తూ మాట్లాడారు. ఈ కార్యక్రమానికి నేతృత్వం వహించిన సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పలు మద్యం దుకాణాలు, బార్లలో సైలెంట్ పార్టనర్ అని, ఉద్యమంలో పాల్గొన్న నాయకులు తాగుబోతులని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో బెల్ట్ షాపులను పుట్టించింది చంద్రబాబునాయుడని వివేకా విమర్శించారు.

స్కూటర్‌పై సోమిరెడ్డి!

16వ తేది మద్యం బెల్ట్‌షాపులకు వ్యతిరేకంగా తెలుగుదేశం పార్టీ మహిళా విభాగం చేపట్టిన మహా ప్రదర్శనకు పెద్ద సంఖ్యలో మహిళలు విచ్చేశారు. విఆర్‌సి నుంచి నర్తకి సెంటర్‌కు ప్రదర్శన చేరను అరగంటకుపైగా పట్టింది. ప్రదర్శన ముందు భాగంలో పెట్టిన మినీ లారీలో పార్టీ మహిళా నాయకురాళ్లు ఎక్కారు. చివరన జీపులో పార్టీ ఎమ్మెల్యేలు బీద మస్తాన్‌రావు, దుర్గాప్రసాద్, కురుగొండ్ల రామకృష్ణ, పరసారత్నంలతో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వుండినారు. జనవాహిని నడుమ జీపు కదలడం ఆలస్యం కావడంతో సభాస్థలికి చంద్రమోహన్‌రెడ్డి స్కూటర్‌పై అతి కష్టం మీద చేరుకొన్నారు. చంద్రమోహన్‌రెడ్డి కోసం ఎదురుచూస్తూ మహిళా నేతలు కాసేపు స్టేజిని ఎక్కలేదు. అనంతరం మహిళా నేతలంతా సోమిరెడ్డి దీక్షాదక్షతలను ప్రశంసించడం విశేషం.

జిల్లాకు మంచి చేస్తా!

తన పదవీకాలంలో సొంత జిల్లాకు ఎంతో కొంత మంచి చేస్తానని ఎస్పీడిసిఎల్ సిఎండిగా బాధ్యతలు స్వీకరించిన వారణాసి కృష్ణమూర్తి చెప్పారు. జిల్లాలోని 33కెవి సబ్‌స్టేషన్లను ఒక రింగ్‌గా మారుస్తాను. దీనివల్ల ఒక సబ్‌స్టేషన్‌లో కరెంట్ పోయినా ఇబ్బంది లేదు. ప్రక్కదాని నుంచి ఇవ్వొచ్చు. రక్షిత మంచినీటి పథకాలకు ఎప్పుడూ విద్యుత్ సౌకర్యం వుండేలా చేస్తానన్నారు. జిల్లాలో ఎఇ, ఎడిఇ, డిఇ పోస్టుల్లో పని చేసిన అనుభవమున్నందు వల్ల సమస్యలన్నీ పరిష్కరించగలనన్న ఆత్మవిశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

ట్రాఫిక్‌ను మర్చిపోతే ఎలా?

నెల్లూరు నగరంలో ఏదైనా ప్రదర్శనలు, రాస్తారోకోలు జరిగిన సమయంలో ట్రాఫిక్ మళ్లింపుపై పోలీసులు ముందు జాగ్రత్తలు తీసుకోవడం లేదు. దీనివల్ల జనం నానాపాట్లు పడుతున్నారు. మద్యం బెల్టుషాపులకు వ్యతిరేకంగా 16వ తేది నగరంలో తెలుగు మహిళలు నిర్వహించిన ధర్నా, బహిరంగ సభను పురస్కరించుకొని సాయంత్రం నాలుగు గంటల నుంచి 7.30 గంటల వరకు ట్రాఫిక్ చిందరవందరయ్యింది. ట్రాఫిక్ నడతపై పోలీసులు ఎటువంటి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోకపోవడం వల్ల ఈ పరిస్థితి ఉత్పన్నమయ్యింది. నర్తకి సెంటర్‌లో తెలుగుదేశం పార్టీ బహిరంగసభకు పోలీసులు ఓకే అనేస్తున్నారు. దీనివల్ల ట్రాఫిక్ నడవను మరో రోడ్డులేక జనం పడుతున్న పాట్లు వర్ణనాతీతంగా వున్నాయి. నగరంలో ధర్నాలు, సభల సమయంలో ట్రాఫిక్ మళ్లింపుపై పోలీసు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకొని వాటికి పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం కల్పించాల్సి వుంది.

శ్వేతపత్రం విడుదల చేయాలి

నెల్లూరు నగరంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై అధికార కాంగ్రెస్ పార్టీ శ్వేతపత్రం విడుదల చేయాకొరవ 14వ పేజీలో

జమీన్‌రైతు సారథి



జమీన్‌రైతు రథ సారథిగా తన ఊపిరి వున్నంత కాలం సేవ చేసి తాను లేకున్నా కలకాలం జమీన్‌రైతు నిలిచేట్టు శ్రమించిన నిస్వార్థజీవి, జమీన్‌రైతు మేనేజింగ్ ఎడిటర్


తూపిలి పార్థసారథి గారు

తనువు చాలించి 20తేదికి 31 సంవత్సరాలు నిండుతాయి. వారిని సంస్మరిస్తూ...

... జమీన్‌రైతు కుటుంబం







● పైపులైను వేసి

ప్రయోజనమేమి?

నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయం నుంచి పొదలకూరు రోడ్డులోని డైకస్‌రోడ్డు వరకు 10 కోట్ల రూపాయలు వెచ్చించి కొత్తగా వేసిన పైపులైను వల్ల ప్రజలకు ఒనకూడిన ప్రయోజనమేమీ లేదు. మూడు నెలల క్రితం ఈ పథకాన్ని పురపాలక శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అట్టహాసంగా ప్రారంభించారు. వాస్తవానికి ఈ కొత్త లైను ఏర్పాటువల్ల వాకర్స్‌రోడ్డు, బట్వాడిపాళెం, పోలీసాఫీసు, పొదలకూరు రోడ్డు చివరి పాయింట్ వరకు నీటి సరఫరా మెరుగుపడాలి. అదిపడక పోగా గత పక్షం రోజులుగా రెండు మూడు రోజులకొకసారి పాతపద్ధతిలో మునిసిపల్ కొళాయిల్లో నీళ్లు వస్తున్నాయి. అవి పదిహేను ఇరవై నిమిషాలకు మించి రావడం లేదు. పొదలకూరు రోడ్డులో మధ్యాహ్నం మూడున్నర ప్రాంతంలో మునిసిపల్ కొళాయిల్లో నీరు వదులుతున్నారు. అసలు ఈ సమయంలో సంసారులెవరైనా నీళ్లు పట్టగలరా? పగలు మొత్తం పనిచేసి మహిళలు విశ్రాంతి తీసుకొనే సమయంలో నీళ్లు వదలుతున్నారంటే కార్పొరేషన్ వాటర్‌వర్క్స్ విభాగంలో ఎటువంటి ప్రబుద్ధులున్నారో అర్థం చేసుకోవచ్చు. ఇంత ఖర్చు చేసి ఈ కొత్త లైను వల్ల ఈ ప్రాంతమంతా నీరు బ్రహ్మాండంగా రావాలి. కానీ పాత లైను మాదిరిగా రోజుకు కనీసం పది లీకేజీలు వుంటున్నాయి. వీటి మరమ్మత్తులకు తగిన సిబ్బంది లేక రెండు రోజులకొకసారి నీళ్లు వదలడం, వేళాపాళా లేకుండా వదలడం వంటివి చేస్తున్నారు. పైపులైను నిర్మాణంలో లోపాలు, నాణ్యతలేని పైపులు వేయడం వల్ల పూర్తి సామర్థ్యంలో నీటిని వదలలేక పోతున్నారు. వాస్తవానికి ఈ పైపులైను ద్వారా కొత్తూరు అక్కడ నుంచి రాజీవ్ స్వగృహ, ఇందిరమ్మ గృహాలకు నీళ్లు అందించాలన్నది సంకల్పం. కానీ సక్రమంగా ఈ పైపులైనుపని చేపట్టక పోవడం వల్ల వేసి ప్రయోజనం లేకుండా పోయింది. 10 కోట్ల రూపాయలు బూడిదలో పోసిన పన్నీరయ్యాయి. దీనికి బాధ్యత ఎవరు వహిస్తారు?




పొదలకూరురోడ్డులో నిత్యకృత్యమైన లీకేజీలు. (ఫైల్‌ఫోటో).

రూ.10కోట్లు వెచ్చించినా పొదలకూరురోడ్డులో నీళ్లు రావు

ఆడంబరంగానే ఆగష్టు 15 వేడుక!

కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధతో ఏర్పాట్లు ఘనం.



స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పోలీసుల కవాతును పరిశీలిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి.

సహజంగా నెల్లూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో ప్రభుత్వ నేతృత్వంలో జరిగే ఆగష్టు 15 వేడుకలు మొక్కుబడి కార్యక్రమంలా జరిగేవి. ఈసారి మాత్రం ఆడంబరంగా జరిపారు. గత ఏడాది వేడుకల సందర్భంగా వర్షం వచ్చి తెల్ల సూట్‌లో వచ్చిన మంత్రి రామనారాయణరెడ్డి తడచిపోయారు. ఈ సారి అలా జరగకూడదనేమో పెరేడ్ గ్రౌండ్‌లో జెండా వందనం జరిగాక వర్షం వచ్చినా ఇబ్బంది పడకుండా అతిథులు కూర్చోను చక్కని స్టేజి, దానిపై కప్పు ఏర్పాటు చేశారు. వీక్షకుల కోసం కూడా శాశ్వత ప్లాట్‌ఫారంతో రేకులషెడ్ వేసిపారేశారు. వేడుకలకు వచ్చిన వీక్షకులకు మినరల్ వాటర్, చిన్న బిస్కెట్ ప్యాకెట్లు, అతిథులకు ఫిల్టర్ కాఫీ వంటి ఏర్పాట్లు చేశారు. సంప్రదాయబద్ధంగా ముప్పన్నెల పతాకాలు, మామిడి తోరణాలు, అరటి పిలకల వంటివి కట్టించి కలెక్టర్ గారు మొత్తానికి ఈ కార్యక్రమం అదిరిందని పించారు. పిల్లలు సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చే సమయంలో సిడి ప్లేయర్ మొరాయించడం మినహా మరో అపశృతి లేదు. తుంటి ఎముక పెడుతున్న బాధను పంటి బిగువున భరించి నాలుగు గంటల పాటు నిలబడి రామనారాయణరెడ్డి జిల్లా అభివృద్ధిపై ప్రసంగం చేయడంతోపాటు ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు ఇచ్చారు. ఆయన ఉపన్యాసంలో పురపాలక శాఖకు ఈసారి పెద్ద పీట వేశారు. నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయాన్ని 10.25 కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి అత్యాధునికంగా నిర్మిస్తున్నామన్నారు. 123 కోట్ల రూపాయలు వెచ్చించిన సమ్మర్ స్టోరేజి ట్యాంకు నిర్మాణం కూడా పూర్తవుతుందన్నారు. 441.58 కోట్ల రూపాయలతో భూగర్భ డ్రైనేజి, 158 కోట్లతో మంచి నీటి సరఫరా పైపులైన్ల విస్తరణ చేపడుతున్నామన్నారు. కోటి రూపాయలతో చేపల మార్కెట్‌ను ఆధునీకరిస్తున్నామని, నగరంలో లింకు రోడ్ల అభివృద్ధికి 18 కోట్ల రూపాయలు మంజూరు చేసామని మొత్తం వందల కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు కనికట్టుచేసేలా చెప్పారు. మేజర్ పంచాయితీలైన ఆత్మకూరు, అల్లూరు, కోవూరు, నాయుడుపేట, బుచ్చిరెడ్డిపాళెం, సూళ్లూరుపేటలను మునిసిపాలిటీలుగా మారుస్తామన్నారు.

రత్నం గ్లోబల్ స్కూల్, ఫ్యాక్ట్ ఇంగ్లీషు మీడియం స్కూల్, లిటిల్ ఏంజెల్స్, జవహర్ బాలభవన్, మూలపేట ప్రభుత్వ బాలికల పాఠశాల, కావలి పిరమిడ్ స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. ప్రభుత్వ శాఖల శకటాలు అట్టహాసంగానే వుండినాయి. వేడుకలకు జిల్లా కలెక్టర్ రాంగోపాల్, ఎస్పీ దామోదర్, ఎమ్మెల్యేలు శ్రీధర్‌కృష్ణారెడ్డి, వివేకానందరెడ్డి, ఎమ్మెల్సీలు బాలసుబ్రహ్మణ్యం, రాఘవేంద్రరెడ్డి తదితరులు హాజరయ్యారు.



పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో పిల్లల సాంస్కృతిక ప్రదర్శన.



పోలీసు జాగిలం పింకీ సాహస విన్యాసం.

పేరుకే యూనివర్శిటీ!



పరిపాలనా భవనంతో సరిపెట్టుకొంటే ఎలా?

పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా వుంది విక్రమ సింహపురి యూనివర్శిటీ పరిస్థితి. వసతుల్లేక, అరకొర సౌకర్యాల నడుమ చదువుకొంటున్నారు విద్యార్థులు. యూనివర్శిటీ ఏర్పాటుకు 2008లో ఆమోదం లభించింది. తాత్కాలికంగా విఆర్ హైస్కూల్ మిద్దెపైన తరగతులను నిర్వహిస్తున్నారు. పరిపాలనా భవనాన్ని నెల్లూరు చెరువు వద్ద ఏర్పాటు చేశారు. విద్యార్థులకు హాస్టల్‌ను కొండాయపాళెంగేటు వద్ద నిర్వహిస్తున్నారు. ఇలా ఒక్కొక్కటి ఒక్కోచోట వుండడం, సరిపడా గదులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు విద్యార్థులు. క్రొత్త యూనివర్శిటీని సమస్యలు చుట్టుముట్టడానికి ప్రధాన కారణం స్థలం కేటాయింపు జరగకపోవడమే. దీంతో యూనివర్శిటీని బాలారిష్టాలు వెన్నాడుతున్నాయి. ఇక విద్యార్థులకు సంబంధించి తరగతుల నిర్వహణ, భవనాలకు సంబంధించి అనేక విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సైన్సు విద్యార్థులకు అవసరమైన పూర్తిస్థాయి ప్రయోగశాలలు అందుబాటులో లేకపోవడంతో అరకొర వసతుల నడుమే విద్యాభ్యాసం కొనసాగించాల్సి వస్తోంది. 2008 – 09 విద్యా సంవత్సరంలో ఏర్పాటైన విక్రమ సింహపురి యూనివర్శిటీకి 2010 – 11 విద్యా సంవత్సరంలో క్రొత్తగా మరిన్ని కోర్సులు వచ్చాయి. కానీ సౌకర్యాలు మాత్రం పూజ్యం. యూనివర్శిటీకి 4.5 కోట్ల రూపాయల నిధులు విడుదలైనప్పటికీ విసిరేసినట్లు ఒక్కొక్కటి ఒక్కోచోట వుండడంతో విద్యార్థులు, అధ్యాపకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి స్థలం కేటాయింపు జరిపి పూర్తిస్థాయిలో యూనివర్శిటీ ఏర్పాటు జరిగేలా చూడాల్సి వుంది.

యదేచ్ఛగా మద్యం అమ్మకాలు

స్వాతంత్ర దినోత్సవం, గణతంత్ర దినోత్సవం నాడు మద్యం అమ్మకాలను నిషేధించింది ప్రభుత్వం. ఎక్కడా ఎవ్వరూ ఇలాంటి వాటికి పాల్పడరాదని చట్టాన్ని చేసినప్పటికీ అదెక్కడా అమలు కాకపోవడంతో ప్రభుత్వ చట్టాలు అవహేళన పాలవుతున్నాయి. ఆగష్టు 15న మామూలు రోజు కంటే మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా జరిగాయి. పేరుకు షాపులు మూసివేసినట్లు కన్పించినప్పటికీ అంతా వెనుక నుంచి సాధారణ దినాల కంటే అధికంగానే మద్యం విక్రయాలు జరిగాయి. మద్యం వ్యాపారులు డ్రైడేని తమకు అనుకూలంగా మలచుకొని అధిక ధరలకు మద్యాన్ని అమ్మారు. కొన్ని చోట్ల డోర్‌డెలివరీ సౌకర్యాన్ని కల్పించారు. మద్రాస్ బస్టాండ్, ఆత్మకూరు బస్టాండ్, వెంకటరమణ థియేటర్, పొదలకూరురోడ్డు, వేదాయపాళెం, బాలాజీనగర్, విజయమహల్ గేట్, అయ్యప్పగుడి తదితర ప్రాంతాలలో మద్యం విక్రయాలు బహిరంగంగానే జరిగినప్పటికీ ఎక్సైజ్ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడం విశేషం. ముందుగా మద్యం వ్యాపారులు వారితో కుదుర్చుకొన్న లక్షల రూపాయల ఒప్పందమే కారణమని సమాచారం. దీనికి తోడు డైకస్‌రోడ్డులోని మార్కెట్‌లో మాంసం విక్రయాలు జరిగినా మునిసిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో డ్రైడే కాస్త విఫలమయ్యింది.



ఆగష్టు 15వ తేది నెల్లూరు నగరంలో తెరచిన ఓ బ్రాందీ షాపు.

• గతి తప్పిన

బ్రిడ్జి స్కూల్స్!

జిల్లాలో బ్రిడ్జి స్కూళ్ల నిర్వహణ నిమిత్తం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి ఏడాది విడుదల చేస్తున్న కోట్లాది రూపాయల నిధులు దుర్వినియోగ మవుతున్నాయి.



పట్టించుకోని నెల్లూరులోని రాజీవ్ విద్యామిషన్ కార్యాలయం. (ఫైల్‌ఫోటో)

జిల్లాలో నడుస్తున్న రెసిడెన్షియల్ బ్రిడ్జి స్కూళ్లు ఆశించిన ఫలితాలు ఇవ్వడం లేదు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఈ సూళ్ల నిర్వహణ నిమిత్తం ప్రతి సంవత్సరం కోట్ల రూపాయలు ఖర్చు చేయడం జరుగుతుంది. ఈ నిధుల్లో సగభాగం దుర్వినియోగం జరుగుతున్నాయి. అధికారులు అవినీతి, అక్రమాలకు పాల్పడడం, నిర్వాహకులు ధనార్జనే ధ్యేయంగా చేసుకుంటున్నారు. దీంతో వీటి లక్ష్యం నెరవేరకుండా పోతున్నది.

బ్రిడ్జి స్కూళ్ల మంజూరు దగ్గర నుంచి వీటి నిర్వహణకు బిల్లులు చెల్లించే వరకు కార్యాలయ సిబ్బందికి చేతులు తడపందే పని జరగదు. నిర్వాహకుల వద్ద నుంచి లంచాలు తీసుకోవడం వల్ల అధికారులు స్కూళ్ల వైపు కన్నెత్తి కూడా చూడరు. సాధారణ పాఠశాలలకు వెళ్ల లేని పిల్లలను చేరదీసి వారికి అన్ని సౌకర్యాలు కల్పించి విద్యనందించడం ఆర్‌బిసి ముఖ్య వుద్దేశం. అలాగే పేదరికం కారణంగా పాఠశాలకు వెళ్లలేని క్రమంలో సమీపంలోని బ్రిడ్జి స్కూల్లో చేర్పిస్తే మూడుపూటలా భోజన సదుపాయంతోపాటు విద్యను కూడా అందించాల్సి వుంటుంది.

బ్రిడ్జి స్కూళ్లు మంజూరు చేయించుకున్న స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు పాఠశాలలను తూతూ మంత్రంగా నిర్వహిస్తూ లక్షలాది రూపాయల్ని తీసుకుంటున్నారు. 1999–2000 సంవత్సరం నుంచి జిల్లాలో రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేయడం జరుగుతున్నది. జిల్లాలో మొత్తం 96 బ్రిడ్జి స్కూళ్లు వున్నాయి. వీటిలో 4వ తరగతి నుంచి పదవ తరగతి వరకు విద్యనందిస్తారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఏ విధంగా పాఠ్యాంశాలు బోధిస్తారో అదేవిధంగా ఇక్కడ కూడా బోధిస్తారు. 10వ తరగతి సంవత్సరాది పరీక్షలను సమీపంలోని హైస్కూళ్లలో రాయిస్తారు.

ఈ స్కూళ్ల నిర్వహణ నిమిత్తం రాజీవ్ విద్యా మిషన్ నిధులను మంజూరు చేయడం జరుగుతుంది. సంవత్సరానికి పాఠశాల అద్దె రూ.30వేలు, ఒక్కో ఉపాధ్యాయుడికి నెలకు రెండు వేలు, నీటి సరఫరా, విద్యుత్ బిల్లులకు మూడువేలు, ప్లేట్లు, గ్లాసులు, దుప్పట్లకు మూడువేల రూపాయల వంతున చెల్లిస్తున్నారు. అలాగే కాస్మొటిక్ ఛార్జీల క్రింద ఒక్కో విద్యార్థికి నెలకు 25రూపాయలు, వైద్య పరీక్షలకు మరో 50 రూపాయలు అదనంగా మంజూరు చేస్తారు. ఆర్థిక వనరులతో ముడిపడిన ఈ స్కూళ్లను మంజూరు చేయించుకునేందుకు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు పోటీ పడుతుంటారు.

అధికారులకు మామూళ్లు సమర్పించుకుని ఈ స్కూళ్లను దక్కించుకున్న వారు ఏ విధంగా నిర్వహిస్తారో అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాల ప్రకారం ఈ స్కూళ్లను నిర్వహించలేక మధ్యలో కొందరు చేతులెత్తేసిన సంఘటనలు లేకపోలేదు. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు లాభార్జనే ధ్యేయంగా పెట్టుకోవడం వలన ప్రతి ప్రాజెక్టును సక్రమంగా కొనసాగించలేకపోతున్నారు. బ్రిడ్జి స్కూళ్లను ఆయా మండల తహశీల్దార్, ఎంఇఓ, ఎండిఓలతోపాటు రాజీవ్ విద్యా మిషన్ కార్యాలయ అధికారులు నిత్యం పర్యవేక్షణ, తనిఖీలు చేయాల్సి వుంటుంది.

మండలస్థాయి అధికారులు ప్రభుత్వం అమలు చేసే వివిధ పథకాల కార్యక్రమాలలో నిమగ్నమై పోవడంతో వీటి పర్యవేక్షణ గురించి పట్టించుకునే వారు కరువయ్యారు. పాఠశాలలో విద్యార్థులు వున్నా, లేకున్నా బిల్లులు మాత్రం ప్రతినెల క్రమం తప్పకుండా మంజూరవుతుంటాయి. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కొందరు తాము బ్రతకడానికే అన్న రీతిలో ఈ స్కూళ్లను నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు పాఠాలు బోధించి వారిని భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలన్న ఆశయం వీరిలో ఏ కోశాన కానరావడం లేదంటే ఆశ్చర్యపోకతప్పదు.

పదవతరగతి ఉత్తీర్ణత కాని వారు సైతం ఏదో ఒక జాతీయ నాయకుడి పేరుతో స్వచ్ఛంద సంస్థను రిజిస్ట్రేషన్ చేయించి వైద్యశిబిరాలు, రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేయడం వంటి కార్యక్రమాలు చేస్తూ ప్రచారం చేసుకుంటారు. ఆ తర్వాత ఏదో ఒక పార్టీ నేతనో, అధికారినో ఆశ్రయించి ప్రభుత్వ పథకం అమలుకోసం దరఖాస్తు చేసి నిధులు రాబట్టుకోవడం చేస్తారు. రాష్ట్రప్రభుత్వం నుంచే కాకుండా కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ నుంచి కూడా నిధులు మంజూరవుతున్నాయి.

స్వచ్ఛంద సంస్థలకు రాష్ట్రప్రభుత్వం మంజూరు చేసే నిధుల గురించి జిల్లాలోని ఏ అధికారి వద్ద పూర్తి వివరాలు లభ్యం కావు. ఇక కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధుల గురించి తెలిసే అవకాశం వుండదు. బ్రిడ్జి స్కూళ్లు సక్రమంగా పని చేయవన్న విషయం కార్యాలయ అధికారులకు తెలుసు. రెండు, మూడు నెలలకోసారి బిల్లులు చెల్లింపు జరుగుతుంటుంది. ఈ సమయంలో బిల్లు మొత్తంలో 10శాతం కమీషన్ తీసుకుంటారని కొందరు నిర్వాహకులు చెబుతున్నారు.

మొత్తం మీద జిల్లాలో బ్రిడ్జిస్కూళ్లు లక్ష్యాలు సాధించడం లేదన్నది వాస్తవం. రాజీవ్ విద్యామిషన్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా వున్న రమేష్‌కుమార్ వీటి నిర్వహణ గురించి అసలు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వున్నాయి. రాష్ట్రప్రభుత్వం స్పందించి బ్రిడ్జి స్కూళ్ల ఏర్పాటు, నిర్వహణ, ఇక్కడ అందిస్తున్న విద్యపై పరిశీలన చేయాల్సిన అవసరం వుంది.





ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లాపరిషత్ ఛైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి.



నెల్లూరు చంద్రారెడ్డి డిగ్రీకాలేజీలో జరిగిన రోటరాక్ట్ క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నిక సమావేశంలో మాట్లాడుతున్న భరత్‌కుమార్‌రెడ్డి. వేదికపై ప్రతాప్‌రెడ్డి, మధుసూధన్‌రావు, రాఘవేంద్ర శెట్టి.



బెల్ట్‌షాపులకు వ్యతిరేకంగా తెలుగుదేశం పార్టీ మహిళా విభాగం జరిపిన మహాసభకు భారీగా తరలి వచ్చిన మహిళలు.



నెల్లూరు వేదాయపాళెంలోని లిల్లీ లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో జాతీయ నాయకుల వేషధారణలో స్కూల్ పిల్లలు.

చిక్కుల్లో చంద్రమోహనుడు!



నిజాలు మాట్లాడి ఇబ్బందులు పడుతున్నాడట.

ఉన్నది వున్నట్లు మాట్లాడి అందరికి చెడ్డ అవుతున్నానని టిడిపి జిల్లా అధ్యక్షుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. విమర్శించిన కారణానికి లేనిపోని చిక్కులొచ్చిపడుతున్నాయంటూ సహచరులతో తనగోడు వెళ్లగక్కారు. తోటపల్లిగూడూరు మండలంలో పార్టీని బలోపేతం చేసే కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో సోమిరెడ్డి వివిధ అంశాలపై ప్రసంగించారు. సర్వేపల్లి నియోజకవర్గంలో ఏర్పాటవుతున్న థర్మల్ విద్యుత్ ప్రాజెక్టుల వలన ప్రజలకు బూడిద కష్టాలు తప్పవన్నారు. 1000 మెగా వాట్ల విద్యుత్ వాడకానికి 16,800 టన్నుల బొగ్గును వాడితే 43శాతం బూడిద వస్తుందని, గాయత్రి, నెల్‌క్యాస్ట్, రిలయన్స్ విద్యుత్ కర్మాగారాల ద్వారా 32 వేల టన్నుల బూడిద వస్తుందని గణాంకాలతో సహా చెప్పారు. పర్యావరణం దెబ్బతింటుందని, సముద్రంలో మత్స్యసంపదకు ప్రమాదం వాటిల్లుతుందని ఆందోళన చెందారు. ఇలాంటి సమస్యలు వుండబట్టే సోంపేటలో ప్రజలు తిరుగుబాటు చేశారన్నారు. సోమశిల జలాశయంలో పుష్కలంగా నీళ్లున్నా ఆధునీకరణ పేరుతో రైతులకు రెండో కారు లేకుండా చేశారని విమర్శించారు. ఈ సమావేశంలో బొమ్మి సురేంద్ర, సోమిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, మునుకూరు బాబిరెడ్డి, కోడూరు శ్రీనివాసులరెడ్డి, సనత్‌కుమార్‌రెడ్డి, కావలిరెడ్డి శ్యాంసుందర్ రెడ్డి, జితేంద్ర పాల్గొన్నారు.

ఇంకా అందని భూపరిహారం!

మండపంవాసుల లబోదిబో!

తోటపల్లిగూడూరు మండలం మండపం గ్రామంలో జెన్‌కో ఆధ్వర్యంలోనిర్మిస్తున్న విద్యుత్ కేంద్రానికి సంబంధించి యాష్‌పాండ్ కోసం భూములను సేకరించారు. ఈ భూముల రైతులకు రెండున్నరేళ్లుగా పరిహారం చెల్లించకపోవడంతో అటు భూములను కోల్పోయి, ఇటు పరిహారం అందక రెండిటికీ చెడ్డ రేవడిలా మారారు. అర్హులను ఎంపిక చేయడంలో అధికారులకు స్పష్టత లోపించడం, మరోవైపు రైతులు పరిహారం కోసం పట్టుబడుతుండడంతో పంపిణీలో జాప్యం జరుగుతోంది. దీంతో రైతులు అప్పులపాలవుతున్నారు. ముత్తుకూరు మండలంలోని కృష్ణపట్నంలో జెన్‌కో నిర్మిస్తున్న అల్ట్రా మెగా విద్యుత్ కేంద్రంలో భాగమైన యాష్ పాండ్ కోసం మండపం పంచాయితీలో 500 ఎకరాల భూమిని అధికారులు సేకరించారు. ఇందులో 285 ఎకరాల పట్టాభూములకు ఎకరాకు రూ.7.15లక్షల వంతున పరిహారం చెల్లించారు. మిగిలిన 215 ఎకరాల సిజెఎఫ్‌ఎస్ భూములకు పరిహారం పంపిణీ కాలేదు. ఈ భూములకు 220 మంది రైతులు హక్కుదార్లమని చెప్తుండడం, కొన్ని అభ్యంతరాలు వుండడంతో పంపిణీ ఆలస్యమైంది. ఈ పరిస్థితులలో అధికారులు ఎకరాకు రూ.4.16 లక్షలు చెల్లిస్తామని చెప్తుండగా రైతులు ఎకరాకు రూ.6.30 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేస్తుండడంతో ఎమ్మెల్యే ఆదాల చొరవ తీసుకోవడంతో ప్రభుత్వం అంగీకరించినప్పటికీ దానికి సంబంధించి ఉత్తర్వు రాకపోవడంతో పంపిణీ నిలిచిపోయింది. రైతులు అటు భూములు కోల్పోయి, ఇటు పరిహారం అందక తీవ్రంగా నష్టపోతున్నారు.

భూస్వాములకు భూపంపిణీ!

బోగోలు రెవిన్యూ సిబ్బంది చేతివాటం

బోగోలు మండలంలో పేదలకివ్వాల్సిన భూమిని రెవెన్యూ సిబ్బంది భూస్వాములకు దోచిపెడుతున్నారంటూ సిపిఎం ఆధ్వర్యంలో కావలి ఆర్‌డివో కార్యాలయం వద్ద ధర్నా జరిగింది. మండల పరిధిలోని కడనూతల, అల్లిమడుగు గ్రామాల్లోని పేదలకు భూములు పంచేందుకు సిద్ధం చేసిన పట్టాలను వారికి ఇవ్వకుండానే భూస్వాములకు అప్పగించేందుకు రెవెన్యూ అధికారులు ప్రయత్నిస్తున్నారని సిపిఎం నేత శ్రీరాములు ఆరోపించారు. అల్లిమడుగు రెవెన్యూ పరిధిలో తెల్లగుంట గ్రామం ప్రక్కన 403, 406, 414, 415, 416, 417 సర్వే నెంబర్లలో గల 41 ఎకరాల మిగులు భూమిని పేదల కోసం బోగోలు ఎమ్మార్వో పట్టాలు తయారు చేశారన్నారు. వీటిని పేదలకు ఇవ్వకుండా అల్లంపాటి పార్థసారధిరెడ్డి అనే భూస్వామికి అప్పగించడంపై మండిపడ్డారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని పేదలకు న్యాయం చేయాలని కోరారు.

వెంకటగిరి అభివృద్ధికి 10కోట్లు



వెంకటగిరి పట్టణ అభివృద్ధికి 10కోట్ల రూపాయలకుపైగా నిధులు విడుదల కానున్నాయని మునిసిపల్ ఛైర్మన్ అల్లం చంద్రమోహన్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకమైన రాజీవ్ ఆవాజ్ యోజన క్రింద వెంకటగిరి మునిసిపాలిటీని చేరుస్తూ రాష్ట్రప్రభుత్వం నిర్ణయం తీసుకొన్నదన్నారు. ఈ పథకం క్రింద మౌలిక వసతుల కల్పనకు, మురికివాడల అభివృద్ధికి కోట్ల రూపాయలు విడుదలవుతున్నాయన్నారు. అలాగే 13వ ఆర్థిక సంఘం నిధుల క్రింద 15కోట్లు మంజూరయ్యాయని త్వరలో నిధులు దశల వారీగా విడుదలవుతున్నట్లు చెప్పారు. పురపాలక మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చొరవతో ఈ నిధులు మంజూరైనట్లు అల్లం తెలియజేశారు.



ఉత్తమ సేవలకుగాను మంత్రి రామనారాయణ చేతుల మీదుగా ఆగష్టు 15వతేది ప్రశంసాపత్రాన్ని అందుకొంటున్న నెల్లూరు సహకార శాఖాధికారి కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ ఐ.డి.మంజులాదేవి

ముత్తుకూరు దర్జీ రికార్డు

తనలోని నైపుణ్యాన్ని సృజనాత్మకతను లోకానికి చాటి చెప్పాడు ముత్తుకూరు చెందిన టైలర్ కంచి శ్రీనివాసులు. దర్జీగా తన 25ఏళ్ల అనుభవంతో 33 అడుగుల ప్యాంటు, 13 అడుగుల చొక్కా కుట్టి అందరిని ఆశ్చర్యపరిచాడు. అందరి లోకి ప్రత్యేకంగా కన్పించాలని ఎవరూ చేయని పని చేసి తననుతాను నిరూపించుకోవా లని కలలు కనే శ్రీనివాసులు తన భార్య సుగుణమ్మ సహకారంతో ఒక్క రోజులో 65 మీటర్ల గుడ్డతో ఈ ప్యాంటు, చొక్కాను రూపొందించాడు. చొక్కా జేబుపై జాతీయ పతాకాన్ని, ప్యాంటుపై శాంతికి చిహ్నమైన కపోతాన్ని, కృష్ణపట్నం పోర్టును రూపొం దించి తన నైపుణ్యాన్ని చాటుకొన్నాడు. వీటిని ప్రదర్శనకు వుంచడంతో చుట్టుప్రక్కల గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి శ్రీనివాసులను అభినందించారు. ఎలా గైనా లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్సులో చోటు సంపాదించుకోవాలన్నదే తన ఆశయం అంటున్నాడు శ్రీనివాసులు.

వెలవెల పోతున్న ఆరోగ్య కేంద్రం

బోగోలు మండలం కోవూరుపల్లి ఆరోగ్యకేంద్రం రోగులు రాక వెలవెల పోతుంది. మండల కేంద్రానికి ఐదు కిలోమీటర్ల దూరంలో వున్న ఈ గ్రామంలో 1500 మంది జనాభా వున్నారు. స్థానికంగా ఆరోగ్య కేంద్రం వున్నా అధిక భాగం కావలికి వైద్య చికిత్సలకు వెళ్తుండడంతో ఈ ఆరోగ్య కేంద్రం నామమాత్రమైంది. బోగోలు, విశ్వనాధరావుపేట ప్రాంతాల వారు కావలికి వెళ్లి చికిత్స పొందడానికి కారణం ప్రయాణ ఖర్చులు. కోవూరుపల్లి ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలంటే తగిన రవాణా సదుపాయంలేక ఆటోలను ఆశ్రయించాల్సి రావడంతో రాకపోకలకు అదనపు ఖర్చువు తుందని కావలికి వెళ్లేందుకు మొగ్గుచూపుతున్నారు చుట్టుప్రక్కల ప్రాంతాలవారు. బోగోలు మండలంలో 60వేల జనాభా వున్నారు. మేజర్ పంచాయితీలైన విశ్వనాధరావుపేట, బోగోలులో 30వేల మంది జనాభా నివసిస్తున్నారు. అంతటి జనాభా గల ప్రాంతంలో ఆరోగ్య కేంద్రం లేకపోవడం కూడా ప్రజలకు ఇబ్బందిగా మారింది. కోవూరుపల్లిలో ఆరోగ్యకేంద్రం ఉన్నా నిరుపయోగంగా మారితే, అవసరమైన బోగోలులో లేకపోవడం విచిత్రం. ఇప్పటికైనా అధికారులు ప్రజల అవసరాలను దృష్టిలో వుంచుకొని పిహెచ్‌సి సబ్‌సెంటర్‌నైనా బోగోలులో ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

హద్దు మీరుతున్న ఆటోవాలాలు!

మనుబోలు మహిళ లబోదిబో

ప్రయాణ సౌకర్యం కోసం ఆటోలు ఎక్కితే ఆ డ్రైవర్లు చేసే వెకిలి చేష్టలు, ద్వందార్ధపు మాటలతో మహిళలకు ప్రత్యక్ష నరకం కన్పిస్తోంది మనుబోలు మండలంలో. ఈ ప్రాంతంలో కోదండరాంపురం సెంటర్ నుండి ఆటోల్లో నిత్యం ఎక్కువమంది ప్రయాణిస్తుంటారు. ఆటోల్లో ఎక్కే మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తుం డడంతో గత్యంతరం లేక వారి బాధ అనుభవించాల్సి వస్తోందని మహిళలు వాపోతు న్నారు. అక్కంపేట, పిడూరు, బండేపల్లి, మడమనూరు, వీరంపల్లి, చెర్లోపల్లి ప్రాంతా లకు నిత్యం ఆటోల్లో ప్రయాణిస్తుంటారు. స్థాయిని మించి ప్రయాణీకులను ఎక్కించు కోవడమే కాక ఆటోల మధ్య పోటీ ప్రాణ సంకటంగా మారింది. ఈ ఆటోవాలాల ధాటికి ప్రజలు హడలిపోతున్నారు. ఆర్‌టివో అధికారులు గాని, పోలీసులు గాని వీరి గురించి పట్టించుకోకపోవడంతో ఈ ప్రాంతంలో ఆటోవాళ్లది ఇష్టారాజ్యం అయ్యింది.

● గొలగమూడిలో

అభివృద్ధి పనులు!



గొలగమూడి వెంకయ్యస్వామి ఆశ్రమాన్ని 5కోట్ల రూపాయలతో అభివృద్ధి పరచేందుకు కమిటీ ప్రణాళికలు సిద్ధం చేసింది. దీనికి సంబంధించి ఆశ్రమ కమిటీ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకొంది. వైద్యం, అన్నదానం, ఎడ్యుకేషన్‌లకు ట్రస్టులను ఏర్పాటు చేయడం తోపాటు ఆశ్రమంలో పని చేసే ఉద్యోగులు సౌకర్యం కోసం డార్మెటరీ, స్టోర్‌రూం, 80 గదులను నిర్మించేందుకు అంగీ కారం తెలిపింది. పాఠశాల, బాలబాలికలకు వసతి గృహాలు ఏర్పాటు కానున్నాయి. వెంకయ్యస్వామి ఆలయ మండపం నుంచి ఎదురుగా వుండే మండపాన్ని కలిపి నిర్మించేందుకు సభ్యులు అంగీకారం తెలిపారని దేవస్థాన కార్యనిర్వహణాధి కారి బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. వెంకయ్యస్వామి ఆలయం వెనుక సుబ్రహ్మణ్యస్వామికి పూజలు, నవగ్రహ పూజలు, అభి షేకాలు నిర్వహిస్తామన్నారు. 50 ఆవులకు గోశాలను నిర్మిస్తు న్నట్లు తెలిపారు. ప్రతి శనివారం ఆలయాన్ని పూలతో అలం కరించేందుకు 5వేల రూపాయన్ని ఖర్చు చేస్తున్నామన్నారు. హైకోర్టు అనుమతితో రోడ్డు నిర్మాణం, ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

ఎమ్మార్వో కార్యాలయంలో రికార్డుల గల్లంతు

భూ పంపిణీకి సంబంధించిన కీలక సమాచారం మాయం

దగదర్తి మండల తహశీల్దార్ కార్యాలయంలో రికార్డులు గల్లంతవుతుండడం కలకలం రేపు తోంది. రోజుకొకటి కన్పించకుండా పోతున్న రికార్డులతో ప్రజలకు ఇబ్బంది కరంగా మారుతుంది. భూపంపిణీకి సంబంధించి పలు కీలక రికార్డులు మాయంకావడంతో ప్రజలు నెలల తర బడి కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోంది. అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన వ్యక్తులకు సంబంధించి నమో దైన ఎఫ్‌ఐఆర్ కాపీలు తహశీల్దార్ కార్యాలయంలో కన్పించడం లేదు. మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ కావ డంతో ఎఫ్‌ఐఆర్ ఒరిజినల్ కాపీలను తహశీల్దార్ వద్దే ఇస్తారు. వీటిని పోలీ సులు కోర్టుకు సమర్పించాల్సి వుం టుంది. కోర్టులో వీటిని అందజేసేం దుకు కాపీల కోసం పోలీసులు కార్యా లయం చుట్టూ తిరుగుతున్నా ప్రయో జనం లేకుండా పోతోంది. దీంతో కోర్టులో విచారణకు నోచుకోవడం లేదు. ఏడాది క్రిందట నుంచి రికా ర్డులు కన్పించకుండా పోతున్నా అధి కారులు బయటకు పొక్కనీయకుండా వుండడంపై పలు అనుమానాలు వ్యక్త మవుతున్నాయి.

చెరువులున్నా నీళ్లుండవు!

వెంకటగిరి రైతుల కష్టాలు తీరేదెన్నడో?

వెంకటగిరి నియోజకవర్గంలో నీటిపారుదల రంగం నిర్లక్ష్యం కారణంగా ఆయకట్టుకు నీరు అందని పరిస్థితులు నెలకొన్నాయి. ఇరిగేషన్, పంచాయితీ రాజ్‌ల పరిధిలో 400కు పైగా చెరువులు వున్నప్పటికీ సాం కేతికంగా అభివృద్ధి చెందని కారణంగా ఆయకట్టు క్రింద సాగువుతున్న పంటలకు నీరు అందకపోవడంతో ఇక అదనపు ఆయకట్టు మాట మరుగునపడిపోతున్నది. ఆనాడు ఎమ్మెల్యేగా వున్న నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి ఇరిగేషన్ డివిజన్ కార్యాలయాన్ని వెంకటగిరికి తీసుకొని వచ్చారు. అయి నప్పటికీ చెరువులను తగినంతగా అభివృద్ధి చేయలేక పోయింది. నియోజకవర్గంలో కండలేరు – పూండి కాలువ వెళ్తునప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. బ్రాంచి కాలువల నిర్మాణాలను పూర్తిచేసి కాలువలకు చెరువులకు అదనంగా తెలుగుగంగ నీటిని ఇచ్చే విధంగా అభివృద్ధి పరచాల్సి వుంది. అలాగే కైవల్యానది, గొడ్డేరు, తెట్టేరు, వెలకంటేరు, నేరేడు కాలువ, మామిడికాలువ, పెదకోన వాగు, చినకోనవాగు వంటి వాటిపై అవసరమైన చోట చెక్ డ్యాంలను నిర్మించి నీటి వనరులను సద్వినియోగపరచి నట్లయితే పంటలకు నీరు అందడంతోపాటు, నిమ్మసాగుకు ఉపయోగపడుతుంది. దీనిని దృష్టిలో వుంచుకొని సాగునీటి రంగాన్ని మెరుగుపరచాలని రైతులు కోరుకొంటున్నారు.

● బుచ్చి బస్టాండ్‌కు

బస్సులు రావు!

బుచ్చిరెడ్డిపాళెంలో లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన ఆర్టీసి బస్టాండు నిరుపయోగంగా మారింది. పట్టణ నడిబొడ్డులో విశాలంగా నిర్మించిన బస్టాండు మొదట్లో బస్సులకోసం వేచి వుండే ప్రయా ణీకులతో కిటకిటలాడుతున్నా కాల క్రమేణ బస్సులు రాక, ప్రయాణీకులు లేక వెలవెల పోతోంది. ఉదయగిరి, ఆత్మ కూరు డిపోలకు చెందిన బస్సులు గతంలో బస్టాండులోకి వస్తుండేవి. ఆ తర్వాత బస్సులన్నీ ముంబాయి రోడ్డు మీదే నిలుస్తుండడం, ప్రయాణీకులు అక్కడే నిలబడుతుండ

ఆర్టీసి అధికారులు పట్టించుకోరేమి?

డంతో బస్టాండు కాస్తా దిష్టిబొమ్మగా మారింది. ఆర్టీసి బస్టాండు వద్దకు బస్సులు రాకపోవడం, జన సంచారం లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. లక్షలరూపాయలు ఖర్చు చేసి నిర్మించిన ఆర్టీసి బస్టాండులోకి బస్సులు రాకుండాపోతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో నిరుపయోగమైంది. దీనిని దృష్టిలో వుంచుకొని అధికారులు స్పందించి ఆర్టీసి బస్టాం దును ఉపయోగంలోకి తీసుకరావాలని స్థానికులు కోరు కొంటున్నారు.



● మద్యం బెల్ట్‌షాపులపై
నెల్లూరు మహిళల సమరశంఖం!

ఉద్యమాల పురిటిగడ్డ సింహపురి గడ్డపై మరోమారు మద్యానికి వ్యతిరేకంగా నారీలోకం సమరశంఖం పూరించింది. రాష్ట్రప్రభుత్వం విచ్చలవిడిగా మద్యం షాపులకు, మద్యం అమ్మకాలకు అనుమతినిస్తూ వేలకోట్ల రూపాయలతో ఖజానాను నింపుకోవడాన్ని నిరసిస్తూ తెలుగుదేశంపార్టీ ఏర్పాటు చేసిన మద్య నియంత్రణ కమిటీ ఆధ్వర్యంలో సింహపురి మహిళామణులు బెల్టు షాపులకు వ్యతిరేకంగా కదం తొక్కారు. చాలా ఏళ్ల క్రిందట దూబగుంట రోశమ్మ తదితరుల స్ఫూర్తితో సారా వ్యతిరేక ఉద్యమానికి శ్రీకారం చుట్టిన ఈ గడ్డపై తిరిగి అదే నారీలోకం బెల్టుషాపులకు వ్యతిరేకంగా, ప్రభుత్వ విధానాన్ని నిరసిస్తూ తమ గళాన్ని, బలాన్ని ప్రపంచానికి చాటి చెప్పింది.

మద్య నియంత్రణ పాటించాలని, విచ్చలవిడిగా, అడుగడుగునా పుట్టుకొస్తున్న బెల్టుషాపులను నిర్మూలించాలని, నిర్ణీత ధరలకే మద్యం అమ్మకాలు జరపాలని, నిర్ణీత సమయాన్ని మద్యం షాపుల నిర్వాహకులు పాటించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తెలుగు మహిళలు ఈ సమరానికి సమాయత్తం అయ్యారు. రాష్ట్ర కమిటీ ఏర్పాటుచేసిన మద్య నియంత్రణ కమిటీ సభ్యులు, రాష్ట్ర తెలుగు మహిళానాయకురాళ్లతోపాటు తెలుగు మహిళా జిల్లాకమిటీ సింహపురి నగరంలో బెల్టుషాపులకు వ్యతిరేకంగా జరిపే పోరులో తొలిఅడుగు వేశారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల నుంచి 15వేల మందికిపైగా మహిళలను చైతన్యపరచి వారందరిని జిల్లా కేంద్రానికి సమీకరించి నగరంలో మహిళా దండుతో భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించి తమ వాడివేడిని ప్రభుత్వానికి తెలిసేలా చేశారు. విఆర్ హైస్కూల్ మైదానం నుంచి బయలుదేరిన భారీ ర్యాలీ అంబేద్కర్ విగ్రహం, ట్రంకురోడ్డు, గాంధీబొమ్మ, ఎసి సెంటర్ మీదుగా నర్తకి సెంటర్ వరకు సాగింది. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మహిళలు తమ వాణిని విన్పించారు. మద్యం వలన పేదలు, చిన్న కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్న తీరును, మద్యం మత్తులో మగాళ్ల రాక్షసకృత్యాలను, చితికిపోతున్న కుటుంబాలను ఉటంకిస్తూ ప్రభుత్వ తీరును తీవ్రంగా విమర్శించారు. ఆనాడు తెలుగుదేశం ప్రభుత్వ తీరుపై విరుచుకపడిన రోశయ్య ముఖ్యమంత్రి కాగానే విచ్చలవిడిగా మద్యం అమ్మకాలకు అనుమతినిచ్చారని, బెల్టుషాపులను ఇష్టానుసారంగా నిర్వహించేందుకు ప్రభుత్వంలోని మంత్రులు వెన్నుదన్నుగా నిలుస్తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రవ్యాప్తంగా బెల్టు షాపులను రద్దు చేయాలని, మద్యంపై నియంత్రణ పాటించాలని, ఎంఆర్‌పి ధరలకే అమ్మకాలు సాగించాలని, నిబంధనలు పాటించని బార్లలైసెన్సు రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రమహిళా నేతలతోపాటు జిల్లాలోని పులువురు మహిళా నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొనగా జిల్లా టిడిపి అధ్యక్షుడు సోమిరెడ్డిచంద్రమోహన్‌రెడ్డి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

మద్యాంధ్రప్రదేశ్ చేస్తున్నారు!



ముఖ్యమంత్రి రోశయ్య ఆంధ్రప్రదేశ్‌ను మద్యాంధ్రప్రదేశ్ చేస్తున్నారు. బెల్టుషాపులను నియంత్రించలేని రోశయ్య తక్షణం గద్దెదిగాలి. 20వేల కోట్లరూపాయల ఆదాయం కోసం 60వేల కోట్ల మద్యాన్ని అమ్మిస్తూ పేదల రక్తమాంసాలను పిండుకొంటున్నారు. రాష్ట్రంలో 1.13లక్షల బెల్టుషాపులున్నాయి. వీటన్నిటిని రద్దుచేయాలి. ప్రజల్లో చైతన్యం కల్గించి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పడానికి ఉద్యమాల పురిటిగడ్డయైన సింహపురిలో ఈ కార్యక్రమం నిర్వహించాం.

–పద్మజ, మద్యనియంత్రణ కమిటీ

తోలుతీస్తాం!



మద్యం వ్యాపారులు, షాపుల నిర్వాహకులకు ఎక్సైజ్ అధికారులు కొమ్ముకాస్తున్నారు. అడుగడుగునా బెల్టుషాపులు నిర్వహించేందుకు అధికారులు అండదండలు అందిస్తున్నారు. ఇప్పటికైనా ఎక్సైజ్ అధికారులు బెల్టుషాపులను నిర్మూలించకపోతే వారి తోలు తీసేందుకు సిద్ధంగా వున్నాం.

–సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షుడు

పేదలను దోచుకతింటుంది!



ఇష్టానుసారంగా మద్యం అమ్మకాలను జరిపించడం ద్వారా పేదల ఇల్లు, ఒళ్లు గుల్ల చేస్తున్నది రాష్ట్రప్రభుత్వం. బడి, గుడి తదితర ప్రాంతాల్లో సైతం బ్రాందీషాపులకు అనుమతినిచ్చారు. అడుగడుగునా ఎక్కడ చూసినా బ్రాందీ, బెల్టుషాపులే కన్పిస్తున్నాయి. ప్రభుత్వ పెద్దలకు ఆదాయం గడించడం తప్ప పేదల బాగోగులు పట్టకపోవడం సిగ్గుచేటు. తక్షణం బెల్టుషాపులను ఎత్తివేయాలి లేకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తాం. మహిళలశక్తి చాటుతాం.


అంచలవాణి, తెలుగుమహిళ జిల్లా అధ్యక్షురాలు

గవర్నర్ గీత దాటుతున్నారు!



రాష్ట్ర గవర్నర్ నరసింహన్ గీత దాటుతున్నారా! అంటే అవుననే అంటున్నారు రాజకీయులు, మేధావులు. రాష్ట్రపరిపాలన, శాంతి భద్రతలకు సంబంధించి ముఖ్యమంత్రి, మంత్రివర్గానిదే బాధ్యతలు కాగా గవర్నర్ కొంతకాలంగా పరిపాలనలో జోక్యం చేసుకుంటున్నారని అధికార వర్గాలు మొత్తుకుంటున్నాయి. రాష్ట్రప్రభుత్వ కార్యక్రమాలు, చర్యలపై గవర్నర్‌కు నేరుగా ఫిర్యాదులందడం ఎక్కువైంది. వాటిపై తక్షణం నివేదిక లివ్వాలంటూ గవర్నర్ ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఐఎఎస్ వర్గాలకు ఇది ససేమిరా నచ్చడం లేదు. అలాగే మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌లను గవర్నర్ బహిరంగంగా సమర్థించడం కూడా వివాదానికి దారి తీస్తోంది. ప్రభుత్వం తప్పుచేస్తే గవర్నర్ దగ్గరకు వెళతాం. అటువంటిది గవర్నరే ప్రభుత్వాన్ని నడుపుతున్నట్లు మాట్లాడితే ఎలా? అంటూ పౌరహక్కుల సంఘాలు మొత్తుకుంటున్నాయి.

'అంబటి' ఆస్తులపై ఆరా!



ప్రస్తుతం సస్పెన్షన్‌లో వున్న పిసిసి కార్యదర్శి పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ మాజీ ఛైర్మన్ అంబటి రాంబాబు ఆస్తులపై రాష్ట్రప్రభుత్వం ఆరా తీస్తోంది. వైఎస్ తనయుడు జగన్‌కు హార్డ్‌కోర్‌గా పేరుబడ్డ అంబటి రాంబాబు కొంతకాలంగా రోశయ్యపై నిప్పులు కక్కుతున్నాడు. దీంతో రోశయ్యకూడా రాంబాబు విషయాన్ని సీరియస్‌గా తీసుకొని పావులు కదుపుతున్నాడు. సొంత జిల్లావాడైన అంబటి తనపై తీవ్ర వ్యాఖ్యలు చేయడం వెనుక జగన్ పాత్ర వున్నా మరీ హద్దులు దాటి ప్రవర్తిస్తుండటం రోశయ్యను బాధిస్తోంది. దీంతో గుంటూరు జిల్లాకు చెందిన ఎమ్పీ రాయపాటి సాంబశివరావు కూడా అంబటికి వ్యతిరేకంగా సాక్ష్యాలు సేకరిస్తున్నాడు. పారిశ్రామిక సదుపాయాల సంస్థ ఛైర్మన్‌గా వున్నప్పుడు వైఎస్ అండతో అంబటి వందలకోట్లు వెనకేసుకున్నాడన్న దానిపై ఇంటిలిజెన్స్ వర్గాలు ఇప్పటికే ఆధారాలు పోగుచేశాయట. రోజులన్నీ ఒకేలా వుండవన్న సత్యం అంబటికి ఇప్పుడిప్పుడే తెలిసొస్తోందట.

'దేశం'లో 'చంద్ర' గ్రహణం



తెలుగుదేశం పార్టీకి సాక్షాత్తు చంద్రబాబే ఇప్పుడు సమస్యగా మారాడు. రాష్ట్రంలో కాంగ్రెస్ అవినీతి, కుమ్ములాటలతో సతమతమవుతున్నా 'బాబు' మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు తమాషా చూస్తుండటం ఆ పార్టీ వారికే నచ్చడం లేదు. ప్రతిపక్షనాయకుడి హోదాలో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా క్రియాశీలకంగా వ్యవహరించాల్సిన సమయంలో 'బాబు' ప్రేక్షకపాత్ర ఆ పార్టీ సీనియర్లలో అసహనాన్ని పెంచుతోంది. దీంతోపాటు ప్రత్యేక తెలంగాణ విషయంలో 'బాబు' మౌనం ఆ ప్రాంత నాయకుల్లో చికాకు తెప్పిస్తోంది. ఇటీవలి ఉపఎన్నికల్లో తెలంగాణలో తెలుగుదేశంకు పట్టిన దుర్గతికి బాబు వ్యవహారశైలే కారణమని వారంటున్నారు. తెలంగాణపై గోడమీద పిల్లి వాటం పార్టీకి చేటు తెస్తోందన్నది సీనియర్ల వాదన. అయితే బాబు మాత్రం తాను పట్టిన కుందేలుకు మూడు కాళ్లే అన్నట్లు మొండిగా ఉన్నాడు. మొత్తానికి తెలుగుదేశంలో 'చంద్ర' గ్రహణం మొదలైంది.

సిఎం మార్పుపై చర్చ



ఈమధ్య నలుగురు కాంగ్రెస్‌వాదులు ఎక్కడ కలిసినా సిఎం మార్పును గురించి మాట్లాడుకోవడం కనిపిస్తోంది. గాంధీభవన్, సిఎల్పీ కార్యాలయాల్లో ఎమ్మెల్యేలు కూడా రాష్ట్ర నాయకత్వం మార్పు గురించే తెగ మాట్లాడుకుంటున్నారు. పిసిసి అధ్యక్షుడిగా డి.శ్రీనివాస్ మార్పు ఇప్పటికే నిర్ణయమైపోయింది. ఇక మిగిలింది రోశయ్యేనన్న గుసగుసలు ఎక్కువయ్యాయి. రాష్ట్రంలో జరుగుతున్న పరిమాణాలకు రోశయ్య అసమర్థత, చేతకానితనమే కారణమని సీనియర్లు గుర్రుగా వున్నారు. వైఎస్ హయాంలో చక్రం తిప్పిన కెవిపిని నేటికీ నెత్తికెక్కించు కోవడం సీనియర్లకు నచ్చడం లేదు. మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పదవులు పంపకం చేయకపోవడానికి కెవిపి సలహాలే కారణమన్నది వారి వాదన. దీంతో రోశయ్య ఆటబొమ్మగా మారి పార్టీని భ్రష్టుపట్టిస్తున్నాడని ఇప్పటికే కొందరు పరోక్షంగా అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. త్వరలోనే రోశయ్యను మార్చుతారని సీనియర్లు ప్రచారం చేస్తున్నారు. చూద్దాం! ఏంజరుగుతుందో!

ఎన్నో వైశిష్ట్యాలకు నెలవు శ్రావణ పూర్ణిమ!

మన సంస్కృతి సాంప్రదాయాలను అర్థవంతంగా ఆవిష్కరించేది, సంపూర్ణంగా ప్రతిబింబింపజేసేది శ్రావణ మాసం. ప్రాచీన భారతీయ విద్యావిధానం ప్రకారం అధ్యయనం ఆరంభమయ్యేది ఈ మాసంలోనే. గురుకులాల్లో వేదపాఠాలు శ్రావణ మాసంలోనే ప్రారంభమవుతాయి. ఈ మాసంలో వచ్చే శ్రావణపూర్ణిమ ఎంతో పవిత్ర మైంది, ఎన్నో వైశిష్ట్యాలకు నెలవైనది. ఈ రోజునే రాఖీపూర్ణిమను దేశవ్యాప్తంగా ఘనంగా జరుపుకొంటారు. హయగ్రీవ జయంతి ఆ రోజునే. శ్రావణ పూర్ణిమకే మరో పేరు జంధ్యాల పూర్ణిమ. ఆగస్టు 24న ఈ పర్వదినాన్ని ఆనందోత్సాహాలతో జరుపుకొంటారు.

రాగబంధం

సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని, సామరస్యం వెల్లివెరిసే పండుగ రాఖీ. సోదర సోదరీ రాగబంధానికి చిహ్నంగా రక్షాబంధనం ప్రాచుర్యంలోకి వచ్చింది. భారతీయ కుటుంబ బాంధవ్యానికి, మాధుర్యానికి ఇది చిహ్నం. సంస్కృతి సాంప్రదాయాలకు నష్టం వాటిల్లినపుడు పరస్పర రక్షణకై వుంటామనేది రక్షాబంధన్ వుద్దేశ్యం. ధర్మరక్షణలో పరస్పరరక్షణ, సమాజ రక్షణ ఇమిడి వుంటాయి. సొదరీ సోదరుల మధ్య ప్రేమానురాగాలకు సూచికగానే కాకుండా ధార్మిక చర్యకు చిహ్నంగా భావిస్తారు. భవిష్యపురాణంలో ఈ ఉత్సవ ప్రస్తావన వుంది. ధర్మరాజుకు శ్రీకృష్ణుడు రక్షబంధన ప్రాశస్త్యాన్ని వివరించినట్లు పురాణ కథనం. కేరళలోనూ శ్రావణ పూర్ణిమను నారికేళ పున్నమిగా జరుపుకొంటారు. ఆరోజున సముద్రుడికి టెంకాయలు కొట్టి పూజిస్తారు. మన ప్రాంతంలో నూతన యజ్ఞోపవీత ధారణ చేస్తారు. అందుకే దీనికి జంధ్యాల పూర్ణిమనే పేరు వచ్చింది.

వేదరక్షకుడు


జ్ఞానానికి ఆధారం శాస్త్రాలు. ఆ శాస్త్రాలకు మూలం వేదం. అలాంటి వేదాలను లోకానికి అందించినవాడు హయగ్రీవుడు. మహావిష్ణువు మరో అవతారం హయగ్రీవావతారం. హయం అంటే గుర్రం, ఆ ముఖం కల్గినవాడు కాబట్టి హయగ్రీవుడని పేరు. మహాభారతం శాంతిపర్వంలో దీని గురించి స్పష్టంగా వివరించినట్లు మహర్షుల ఉవాచ.

మధుకైటభులనే రాక్షసులు నాలుగు వేదాలను అపహరించి సముద్రంలోకి విసిరేస్తారు. బ్రహ్మ సృష్టి రచనకు విఘాతం ఏర్పడిన సమయంలో అశ్వశీర్షం (గుర్రపుతల)తో చిత్రవిచిత్ర వర్ణాలతో, జాజ్వలమైన రూపాన్ని ధరించి రాక్షసులను సంహరించి వేదాలను తిరిగి బ్రహ్మకు అందిస్తాడు. కనుకే ఆయన్ను వేద సంరక్షుడిగా పిలుస్తారు. మంత్ర, తంత్ర, యంత్రాధి సకల విద్యలకు అధిదేవుడు అయిన హయగ్రీవుడు సకల విద్యా ప్రదాత. శ్రావణ శుక్ల పూర్ణిమ రోజును రాఖీ పండుగతోపాటు హయగ్రీవ జయంతిని వైఖానస జయంతిని ఘనంగా జరుపుకోవడం ఆనవాయితీ.



ట్రంకురోడ్డు చతురు


ఉత్తములపై చర్చ



ఆగష్టు 15, జనవరి 26తేది ప్రభుత్వ శాఖల్లో విశిష్ట సేవలందించిన వారికి ప్రశంసాపత్రాలు ఇస్తుంటారు. ఈసారి జిల్లాలో 431 మంది వుద్యోగులకు వీటిని ఇచ్చారు. 13 మంది జిల్లా అధికారులు, రెవెన్యూశాఖలో 26 మందికి, పోలీస్‌శాఖలో 31 మందికి, జిల్లాపరిషత్‌లో 19మంది, డ్వామాలో 18 మంది ఇలా సాగిపోయింది ఈ లిస్టు. అసలు పని చేయని క్రీడాప్రాధికార సంస్థలో 18 మందికి, కార్పొరేషన్‌లో మరో 18 మందికి వీటిని ఇచ్చారు. విద్యుత్‌శాఖలోనూ ఈ అవార్డులపై రగడ జరిగింది. వివిధ శాఖల్లో విశిష్ట సేవలకు బదులు 'చెంచా'లకు వీటిని ఇచ్చారన్న తీవ్ర చర్చ జరుగుతుంది.

శక్తికి మించి శ్రమపెడితే...

మానవుని కన్నా శునకాలకు తెలివి జాస్తి. శునకాల్లో పోలీసు (డాగ్) శునకాలు ఇంకా ప్రత్యేకమైనవి. దొంగలు, హంతకులు, మాదకద్రవ్యాలు, ప్రేలుడు పదార్థాల వునికిని ఇవి సులభంగా పసిగడతాయి. నెల్లూరు పోలీసుశాఖలో పనిచేసే పింకీ అనే శునకం హుషారుగా పని చేస్తుంది. పోలీస్ పేరేడ్ గ్రౌండ్‌లో జరిగిన స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్లో పింకీ విన్యాసాలు ఏర్పాటు చేశారు. మంత్రి రామనారాయణరెడ్డి ముందు పింకీ సాగిలపడింది. ఆ తర్వాత ఆయనకు 'షేక్‌హ్యాండ్' ఇచ్చింది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రింగులలో మంటలు పెట్టినా మూడుసార్లు దూకి గ్రౌండ్‌లో అందరి దృష్టి ఆకర్షించింది. దీని శిక్షకుడు మస్తాన్ నాల్గోసారి దూకమని వత్తిడి చేయగా దూకలేదు. శక్తికి మించి శ్రమపెడితే ఎలానంటూ తోక వూపుకొంటూ వచ్చి శిక్షకుని పక్కన నిలబడిన దృశ్యం ఈ వేడుకల్లో చర్చనీయాంశమయ్యింది.



ఆనం... ఆలస్యం!


రాష్ట్ర పురపాలకశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి నిదానమే ప్రధానమనే పద్ధతిని 'ఫాలో' అవుతుంటారు. ఏ అధికారిక కార్యక్రమానికైనా ఆలస్యంగా రావడం, ఆలస్యంగా వెళ్లడం ఆయనకు అలవాటు అందువల్లే ఆయన పాల్గొనే కార్యక్రమాలంటే అధికారులు, ప్రజాప్రతినిధులు కాస్త లేటుగానే హాజరవుతుంటారు. నిదానమే ప్రధానం సూక్తి మంత్రిగారు ఆగష్టు 15తేదీ జాతీయ జెండా ఎగురవేయడంలోనూ పాటించారు. సహజంగా జిల్లామంత్రి ఖచ్చితంగా తొమ్మిదిగంటలకు పేరేడ్ గ్రౌండ్‌లో జాతీయపతాకాన్ని ఆవిష్కరించి పోలీసు గౌరవవందనాన్ని స్వీకరిస్తారు. రామనారాయణరెడ్డి మాత్రం పాత పద్ధతి ఏమిటని కాబోలు తాపీగా 9-10కి వచ్చి 9-12కు జెండాను ఆవిష్కరించారు. అంతటితో ఊరుకోలేదు. జిల్లా ప్రగతిపై అధికారులు తయారు చేసిన నివేదికను చదవను నిదానం పద్ధతితో 45 నిమిషాలపాటు సమయం తీసుకొని ఆనం... ఆలస్యం నానుడిని నిజం చేశారు.

బిరుసు తగ్గింది



చిత్ర విచిత్ర వేషాలు వేయడంలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి రాష్ట్రంలోనే ప్రసిద్ధి చెందిన రాజకీయవేత్త. 60ఏళ్ల వయస్సులోనూ డ్రస్సింగ్‌పై మంచి శ్రద్ధ చూపే వివేకా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చనిపోయాక ఆయనలా పంచె కట్టుతో కనపడుతున్నారు. బాగా గంజి పెట్టిన పంచె లాల్చీలో ఆకర్షణీయంగా కనిపించే వివేకా ఆగష్టు 15తేదీ ఆయన డ్రస్సు నలిగి కనిపించారు. గంజి బిర్రు తగ్గడమో, విపరీతంగా కార్యక్రమాల్లో పాల్గొన్న ఫలితమో ముడతలు పడ్డ బట్టల్లో కనబడిన తీరు ట్రంకురోడ్డులో చర్చనీయాంశమయ్యింది.

సోనియాను అనుకరించిన భానుశ్రీ!




నెల్లూరు నగరంలో జరిగే ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు, సభలు, సమావేశాల్లో రూరల్ ఎమ్మెల్యే వివేకానందరెడ్డి, మేయర్ భానుశ్రీ కలసి పాల్గొంటుంటారు. ఈ కార్యక్రమాల్లో ప్రత్యేక దుస్తులు ధరించి ఆకర్షణీయంగా కనపడే భానుశ్రీకి కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ నిండుగా కట్టే చీర కట్టు బాగా నచ్చినట్లుంది. స్వాతంత్ర్య దినోత్సవం రోజు మంచి పట్టు చీరను సోనియా స్టైల్‌లో కట్టి చెంగు పూర్తిగా కప్పి ఆలస్యంగా పోలీసు పేరేడ్ గ్రౌండ్‌కు వచ్చి అందరి దృష్టిని ఆకర్షించారు.



మేషం
అశ్వని, భరణి, కృత్తిక 1 పా

ఆరోగ్యవిషయంలో శ్రద్ధ అవసరం. గొంతు, ముక్కు సంబంధిత బాధలుండవచ్చు. మిత్రుల మూలంగా మేలు. ధన విషయాలలో లోటులేదు. నూతన మార్గాలలో ధనప్రాప్తి అవకాశాలు. ఆగిన పనులు నిదానంగా సాగుతాయి. ఇతరులతో అభిప్రాయభేదాలు రావచ్చు. మాట నిలబెట్టుకోవడానికి శ్రమపడతారు. పాదాలకు గాయాలు తగిలే అవకాశం. రాజకీయులకు ఉత్తమకాలం.



వృషభం
కృత్తిక 2,3,4 పా. రోహిణి, మృగశిర 1,2 పా

పైత్యప్రకోపం. అధిక ఖర్చులు మనసును కుంగతీస్తాయి. బంధువుల రాక తృప్తినిస్తుంది. దైవ కార్యాలలో ఎక్కువగా పాలు పంచుకోవాలి. వ్యాపారులకు లాభాలలో కొంత కోత ఏర్పడవచ్చు. నిదానంగా ఖాతాదారుల మనసెరిగి నడచుకోవడం మంచిది. భాగస్వాములతో గొడవలు రాకుండా చూసుకోవాలి. రాజకీయులు లేని పోని గొడవల్లో చిక్కుకొంటారు. ఉద్యోగులకు కొంత మేలు.



మిథునం
మృగశిర 3,4 పా. ఆర్ద్ర,పునర్వసు,1,2,3 పా

గాయాలు తగిలే అవకాశాలెక్కువ. ఆంత్ర సంబంధిత బాధలుండవచ్చు. ధన విషయంలో కూడా కటకట ఉండవచ్చు. సోదరుల సాయమందుతుంది. మిత్రులు ఆర్థికవిషయాలలో మంచి సలహాలిస్తారు. పనులు నిదానంగా సాగవచ్చు. ఒకటికి రెండుసార్లు ఆలోచించి చేయడం మంచిది. వ్యాపారులు ఖాతాదారులతో జాగ్రత్తగా నడచుకోవాలి. విద్యార్థులకు ఒకవిధంగా చదువు సాగుతుంది.



కర్కాటకం
పునర్వసు 4 పా. పుష్యమి, ఆశ్లేష

బంధువుల రాక తృప్తినిస్తుంది. దైవ కార్యాలలో ఎక్కువగా పాలు పంచుకొంటారు. వ్యాపారులకు లాభాలతో మనశ్శాంతి ఏర్పడవచ్చు. నిదానంగా ఖాతాదారుల మనసెరిగి నడచుకోవడం మంచిది. భాగస్వాములతో గొడవలు రాకుండా చూసుకోవాలి. రాజకీయులు లేనిపోని గొడవల్లో చిక్కుకొంటారు. ఉద్యోగులకు కొంత మేలు. సరైన ఆలోచనలు మేలు చేస్తాయి.



సింహం
మఖ, పుబ్బ ఉత్తర 1 పా

కళత్రంతో సంబంధాలు చక్కగా ఉండకపోవచ్చు. ధన విషయాలలో లోటులేదు. ధనప్రాప్తి బాగుంటుంది. వ్యాపారులు భాగస్వాముల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. వ్యాపారంలో పోటీ తగ్గు ముఖం పడుతుంది. వాహనాలు నడిపే సమయంలో జాగ్రత్త. ఉద్యోగులకు వృత్తి లేదా ఆదాయవృద్ధి ఉండవచ్చు. రాజకీయులకు ఉత్తమ కాలం. వృత్తిపరులు లాభపడతారు. విద్యార్థులకు కొంత మేలు.



కన్య
ఉత్తర 2,3,4పా, హస్త, చిత్తా 1, 2 పా

పిల్లల అనారోగ్యం కొంతమెరుగు. స్పెక్యులేషన్ లాభించవచ్చు. దైవకార్యాలలో పాలు పంచుకొంటారు. వ్యాపారులు భాగస్వాములతో జాగ్రత్తగా మెలగాలి. పైవారి ఆదరణ ఉద్యోగులకు లభిస్తుంది. రియల్ ఎస్టేట్, భూభవనాల, వస్తువాహనాల ద్వారా ఆదాయమార్గాలు సులభతరమవుతాయి. వారసత్వాల గొడవలు లాభకరంగా ముగుస్తాయి. రాజకీయులకు ప్రోత్సాహం తక్కువ.

వారఫలాలు

తేది 21-08-2010 నుండి 27-08-2010 వరకు సింహంలో రవి, బుధులు; మీనంలో గురువు; కన్యలో శని, శుక్ర, కుజులు; ధనుస్సులో రాహువు; మిథునంలో కేతువు; ధనుర్మకర, కుంభ, మీనాల్లో చంద్రుడు సంచరిస్తారు.

పంచాంగం

23తేదీ యజుర్వేద ఉపాకర్మ.
24తేది రాఖీ పండుగ, హయగ్రీవ జయంతి.
25తేది గాయత్రీ జపం.
27తేది రాఘవేంద్రస్వామి ఆరాధన

శుభ ముహూర్తాలు

23, 25, 27తేదిల్లో తులాలగ్నాన ప.10.00 నుంచి 12.00 గంటల వరకు.

22, 26, 27తేదిల్లో కర్కాటక లగ్నాన తె.3.00 నుంచి 4.00 గంటల వరకు వివాహాదులకు సుముహూర్తాలున్నాయి.

ఆగష్టు తిథులు


శ్రావణ శుద్ధ

21	శని	ద్వాదశి	సా.3.27	గం.ల.వ
22	ఆది	త్రయోదశి	సా.5.37	గం.ల.వ
23	సోమ	చతుర్దశి	రా.7.58	గం.ల.వ
24	మంగళ	పౌర్ణమి	రా.10.24	గం.ల.వ

శ్రావణ బహుళ

25	బుధ	పాడ్యమి	రా.12.51	గం.ల.వ
26	గురు	విదియ	తె.3.13	గం.ల.వ
27	శుక్ర	తదియ	తె.5.26	గం.ల.వ

పి.ఎం.గోపాలాచారి
16/1020, పొగతోట, నెల్లూరు – 1.
E-mail:maripmgg@yahoo.com



తుల
చిత్తా 3,4 పా, స్వాతి, విశాఖ 1,2,3 పా

ఇరుగుపొరుగువారి తోడ్పాటు చక్కగా ఉంటుంది. ఆరోగ్య విషయంలో శ్రద్ధ అవసరం. ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. తోటివారు సాయమందిస్తారు. నూతనమిత్రులు ఏర్పడతారు. కీళ్ల బాధలుంటాయి. విదేశప్రయాణావకాశాలు కానవస్తున్నాయి. గృహాలంకరణలో శ్రద్ధ చూపుతారు. వ్యాపారవృద్ధి చక్కగా సాగుతుంది. కొత్త భాగస్వామి లేదా మంచి అనుచరులు లభిస్తారు.



వృశ్చికం
విశాఖ 4 పా, అనూరాధ, జేష్ఠ

కళత్రసంబంధం చక్కగా ఉంటుంది. ఉద్యోగంలో నూతన బాధ్యతలు అధికం. చిరకాలంగా ఎదురు చూస్తూ వచ్చిన శుభ ఫలితాలు అనుభూతిలోనికి వస్తాయి. అగ్ని, విద్యుత్తు సంబంధిత బాధలుండవచ్చు. జాగ్రత్త. బంధువులకు మీ చేతనైన సహాయం చేస్తారు. వ్యాపారులు కొత్తసంబంధాలు ఏర్పరచుకొంటారు. రాజకీయులకు ప్రోత్సాహకరమైన కాలం.




ధనస్సు
మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా

పౌరసంబంధాలు చక్కగా వుండవు. జీవితభాగస్వామి బంధువులతో గొడవలుండవచ్చు. నోరు పారవేసుకోకుండడం మంచిది. ప్రతి పని నిలిచి నిదానంగా చేయడం మంచిది. వృత్తిలో మార్పు చేర్పులుండవచ్చు. వ్యాపారులకు కొంతవరకు మేలు. భాగస్వాములతో జాగ్రత్త. దైనందిన కార్యక్రమాలలో ఆటంకాలుండవచ్చు. విద్యార్థులకు ఒకమోస్తరుగా చదువు సాగుతుంది.



మకరం
ఉత్తరాషాఢ 2, 3,4 పా. శ్రవణం, ధనిష్ఠ 1, 2 పా

ఆరోగ్యవిషయంలో పెద్దగా చెప్పుకోతగ్గవేమీ లేవు. అయినా పాదాలకు సంబంధించిన బాధలుంటాయి. ఆర్థికవిషయాలు చక్కగా ఉన్నాయి. నూతన వస్త్రాభరణాలు కొంటారు. గృహావసర వస్తువులు కొంటారు. ఖర్చుకు వెరవరు. ప్రతి పనిలో దూకుడు అధికం. విద్యార్థులకు ప్రయోజనవంతమైన కాలం. అన్ని రంగాలలో ముందంజ వేస్తారు. వ్యాపారులకు అత్యంతం చక్కని కాలం.



కుంభం
ధనిష్ఠ 3,4 పా. శతభిషం, పూర్వ భాద్ర 1,2,3 పా

వృథా ఖర్చులు తయారుగా ఉంటాయి. ప్రతి అడుగు ఆచితూచి వేయడం మంచిది. అనవసరపు విషయాలలో జోక్యం చేసుకోకుండడం మంచిది. ఆర్థికవిషయాలు కొంత తృప్తికరంగా ఉంటాయి. వ్యాపారులు భాగస్వాములతో సఖ్యంగా ఉండడానికి ప్రయత్నించండి. రాజకీయులు తోటివారి విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఉద్యోగులు అధికారుల ఒత్తిడికి గురవుతారు.



మీనం
పూర్వాభాద్ర 4 పా, ఉత్తరాభాద్ర, రేవతి

గాయాలు తగులవచ్చు. ప్రయాణాలలో జాగ్రత్త అవసరం. ముందుచూపుతో అడుగేయాలి. ప్రతి విషయంలో ఎదుటివారిని తప్పుగా అంచనా వేస్తారు. గుట్టుగా కాలం గడపడం మంచిది. ఆర్థిక విషయాలు అంతంతమాత్రమే. వ్యాపారులు ఖాతాదారులతో జాగ్రత్తగా మెలగాలి. రాజకీయులకు తీరని వేదన చోటుచేసుకొంటుంది. ఎదురు చూసిన సత్ఫలితాలు దక్కవు.

దక్షిణ దిశాగృహం కూడా కలసి వస్తుంది!

వాస్తు సందేహాలు సమాధానాలు
ఆచార్య సుబ్రహ్మణ్య మహర్షి
4వ వీధి, గాయత్రినగర్, ఎ.కె. నగర్ పోస్టు, నెల్లూరు-4.
ఫోన్: 2322345, సెల్: 9490125878.

పి.ఆర్.కిరణ్మయిరెడ్డి ఆత్మకూరు

** దక్షిణస్థానం కలసి వస్తుందా?*

దక్షిణ దిశాగృహం యమస్థానం నియమ నిబంధనలకు అనుగుణమైతే బాగా కలసి వస్తుంది. ప్రవర్తన, పూజ, నైతికత ఈ స్థలంపై ప్రభావాన్ని చూపిస్తాయి.

పఠాన్ మెహెరున్నీసా నెల్లూరు

** మా వారు వాస్తును నమ్మరు. ఇప్పుడు అనుభవిస్తున్నాం.*

ప్రహరీ లేక, దిక్కుల్లో స్థలాలు వదలక, దేవుడి గది కూడా లేక మీ గృహం 'ఓ భూత' గృహంలా వుంది. 'బయ్యా' అంటూ ఉత్తరం రాశాక తప్పక మీ పరిస్థితిని సరిచేస్తాను. అది నా బాధ్యత కూడా బెహెన్!

తాడిపత్రి రమణయ్య సైదాపురం

** ఈశాన్యం 'చిన్నికుండ' చాలా బాగా పని చేసింది.*

ఇంట్లో 'మనుషులు', పశువులు రోగగ్రస్థులవుతున్నప్పుడు ఈశాన్యం చిన్న కుండలో పసుపు, ఆవాలు, సాంబ్రాణి, జిల్లేడు పూలు, కర్పూరం, గుగ్గిలం మూటకట్టడాన్ని 'అగస్త్య ధర్మకతువు' 'మృణ్మయ బంధనం' అంది. ఇది శాస్త్రీయంగా కూడా ఆరోగ్య హేతువే.

పి.సత్యనారాయణశర్మ ఒంగోలు

** ఆమె కోలుకొంటుంది, మళ్లీ మంచాన పడుతుంది. అంతా అయోమయంగా వుంది?*

దక్షిణ, ఆగ్నేయ దిశాలోపాల్ని వెంటనే సవరించుకోండి. ఈలోగా 'లక్ష్మీకృత వాస్తు యంత్ర' ప్రతిష్ట చేసుకోండి.

పి.వి.సత్యవతమ్మ తడ

** ఈ సంవత్సరం చదువులో అమ్మాయి బాగా వెనుకబడి పోయింది?*

ముత్యం, పగడం కుడి ఉంగరం, చిటికెన వ్రేళ్లకు ధరింపజేయండి. ఇంట్లో 'సుదర్శన యంత్ర' ప్రతిష్ట చేయించండి. ఫలితం వుంటుంది.

జగన్నాటి రమణయ్య నెల్లూరు

** ఇంట్లో ఎప్పుడూ ఆర్థికమో, అనారోగ్యమో వుంటుంది. ఎందువల్ల?*

పశువుల్ని నైరుతిలో వుంచడం, ఈశాన్యం వంట చేయడం, ఇంట్లో వాస్తు లేకపోవడం కారణం. వాస్తుయంత్రం(ఉత్తమార్థం) ప్రతిష్ట చేయండి.

కె.ఎన్.తిరుపతిరావు విజయవాడ

** ఎప్పుడూ మానసికంగా బావుండదు. ఏదో ఒక సమస్య.*

వాయువ్యం సెప్టిక్‌ట్యాంకును వెంటనే తొలగించండి. నైరుతి వంటను మానేయండి. ఇంట్లో సుదర్శన యంత్ర ప్రతిష్ట చేయండి.

వై.ఆర్.సరస్వతమ్మ గూడూరు

** నైరుతి గుంట పూడ్చేశాక, ఆయన మళ్లీ మామూలు మనిషయ్యారు.*

నిరుతి(రాక్షస) స్థానం భ్రంశమయితే అనారోగ్యం, మృత్యువు తప్పనిసరి. మంచి పని చేశారు. వెంటనే శక్తి యంత్ర ప్రతిష్ట చేసుకోండి.

తూర్పు రామిరెడ్డి హైదరాబాద్

** ప్రారంభించిన ప్రతి పనికీ ఆటంకం కలుగుతున్నది?*

వెంటనే వైడూర్యం(శ్రేష్ఠ) ధరించండి. సెప్టిక్ ట్యాంకు ఏ మూలా వుండకూడదు. అలాంటివారు వ్యాపారాల్లో రాణించలేరు.

పరాశరం శ్రావణి గూడూరు

** తూర్పు దోషాలున్నాయన్నది నా అనుమానం. అబ్బాయి ప్రవర్తనలో చాలా మార్పు వస్తున్నది.*

తూర్పు దోషయుక్తమైతే మగపిల్లలు భ్రష్టులవుతారు. 'లక్ష్మీగణపతి' యంత్రప్రతిష్ట చాలా వరకు కాపాడుతుంది.

ఎన్.పరమేశ్వరరావు రాపూరు

** ఆవిడ ఆరోగ్యం చెడిపోయింది. ఇంటి పనులు కూడా నేనే చేయవలసివస్తోంది.*

తూర్పు 'సింహద్వారం' దోషం. దక్షిణ గదుల దోషం చాలా ఎక్కువగా వున్నాయి. పశ్చిమ ద్వారం ఎత్తైనదిగా వుంది. దాన్ని తూర్పున, తూర్పు ద్వారాన్ని పశ్చిమంలోనూ ఏర్పాటుచేయండి.

ఎవరిష్టం వచ్చినట్లు వాళ్లు కట్టేసుకోవచ్చా?

నెల్లూరు నగరంలోని ట్రంకురోడ్డులో కార్పొరేషన్, ఇతరశాఖల అనుమతి లేకుండా అధికార పార్టీ నేతల అండదండలతో కొందరు కాంట్రాక్టర్లు డివైడర్లు కట్టేస్తున్నారు. ఈ నిర్మాణాలు పూర్తయ్యాక దొడ్డిదారిన వీరికి చెల్లింపులు జరుగుతున్నాయి.

కొంత మంది కాంట్రాక్టర్లకు ఆర్థికంగా లబ్ధి చేకూర్చాలన్న సంకల్పంతో ప్రజాధనాన్ని దోచి పెడుతున్నారు పాలకులు. వీరికి అవసరమైన పనులు చేసిపెట్టే వారికి కాంట్రాక్టు పనులు అప్పగించడం ఇటీవల ఆనవాయితీగా మారిపోయింది. సంబంధిత శాఖల అధికారులు సైతం ప్రభుత్వ నిబంధనల్ని గాలికొదిలి ప్రజా ప్రతినిధులు చెప్పినట్లుగానే తలలూపుతున్నారు. అవసరం లేకున్నా పనులు కేటాయిస్తూ కోట్ల రూపాయలు దుర్వినియోగం చేస్తున్నారు.

ప్రజాధనం దుర్వినియోగం జరుగుతుందనేదానికి ఉదాహరణగా నెల్లూరు నగరంలో జరుగుతున్న రోడ్డు డివైడర్ల నిర్మాణాన్ని పేర్కొనవచ్చు. నగరంలో అయ్యప్పగుడి నుంచి మద్రాస్ బస్టాండ్ వరకు డివైడర్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ పనులు రెండు భాగాలుగా జరుగుతున్నాయి. అయ్యప్పగుడి నుంచి కెవిఆర్ పెట్రోల్ బంక్ వరకు రోడ్లు భవనాల శాఖ రెండు కోట్ల రూపాయలతో పనులు చేపట్టింది. కెవిఆర్ పెట్రోల్ బంకు నుంచి మద్రాస్ బస్టాండ్ వరకు కొందరు కాంట్రాక్టర్లు పనులు చేస్తున్నారు.

గతంలో నెల్లూరు నగరంలో పలుమార్లు రోడ్డు డివైడర్ల పనులు జరిగి వున్నాయి. వీటితోపాటు వివిధ కూడళ్లలో ఐలాండ్స్ నిర్మాణం కూడా చేపట్టడం జరిగింది. ఈ పనులకు దాదాపు ఆరు కోట్ల రూపాయల్ని ఖర్చు చేశారు. ప్రస్తుతం కెవిఆర్ పెట్రోల్ బంక్ నుంచి మద్రాస్ బస్టాండ్ వరకు జరుగుతున్న పనులకు మునిసిపల్ కార్పొరేషన్‌కు సంబంధంలేదని కమిషనర్ ప్రకటించారు. కొంతమంది కాంట్రాక్టర్లు సొంతంగా ఈ పనులు చేస్తున్నారని చెబుతున్నారు.

కార్పొరేషన్ నుంచి డివైడర్ల నిర్మాణానికి అనుమతి లేకపోవడం కూడా అనేక అనుమానాలను రేకెత్తిస్తుంది. డివైడర్ల పనులు పూర్తి చేసిన తర్వాత కార్పొరేషన్ బిల్లులు చెల్లించే అవకాశం వుందని విపక్ష నేతలు అంటున్నారు. కార్పొరేషన్ అనుమతి లేకుండా పనులు చేస్తుంటే ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఎందుకు అడ్డుకోవడం లేదన్నది కూడా ప్రశ్న. నగరంలో రోజు రోజుకు ట్రాఫిక్ సమస్య పెరిగిపోతున్న తరుణంలో డివైడర్ల నిర్మాణం మరో ఆటంకంగా మారింది.

జిల్లా ఎస్పీ మారినప్పుడల్లా ట్రాఫిక్‌లో మార్పుచేర్పులు జరుగుతున్నాయి. నగరంలో నిర్మించిన డివైడర్లను పగులగొట్టి వాటి స్థానంలో కొత్తవి నిర్మించడం చేస్తున్నారు. ప్రధాన రహదారిలో తరచూ నిర్మాణాలు చేపడుతున్నందున రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. ఫత్తేఖాన్‌పేట నుంచి మద్రాస్ బస్టాండ్ వరకు రోడ్డు చాలా ఇరుకుగా వుంటుంది. ఈ రోడ్డుపై గతంలో నిర్మించిన డివైడర్లకు ఇరువైపులా రెండు అడుగుల వెడల్పుతో కట్టుబడి చేస్తున్నారు. ఇలా చేయడం వల్ల రోడ్డు మరింత ఇరుకుగా మారుతుంది.



పెద్దాస్పత్రి ఎదురుగా జ్యుడిషియల్ క్వార్టర్స్ దగ్గర అనవసరంగా పెట్టిన డివైడర్ కటింగ్!

పక్షపాతం

నగరంలో జిల్లా ప్రభుత్వ ప్రధాన వైద్యశాల సమీపంలో డివైడర్ల నిర్మాణంలో రోడ్డు భవనాల శాఖ కొంత పక్షపాతం అవలంభించింది. ఇక్కడ తూర్పువైపున జ్యుడిషియల్ ఆఫీసర్స్ అధికార నివాసాలు వున్నాయి. వీటిలో నివసించే అధికార్లు తమ నివాసాల నుంచి కార్యాలయానికి వెళ్లాలంటే రాజరాజేశ్వరి గుడి దగ్గర నుంచి తిరిగి నగరంలో రావాల్సి వుంటుంది. వీరు అంతదూరం వెళ్లాల్సిన అవసరం లేకుండా అధికార నివాసాలకు వెళ్లే వీధికి ఎదురుగా డివైడర్లు నిర్మించకుండా వదిలేశారు. వాస్తవానికి ఈ క్వార్టర్లకు ప్రక్కనే వున్న రెవిన్యూకాలనీకి వెళ్లే అడ్డ రోడ్డు దగ్గర డివైడర్లు లేకుండా క్రాసింగ్‌కు దారిని వదిలి వుంటే ఈ ప్రాంతీయులందరికీ మేలు జరిగేది. కానీ జ్యుడిషియల్ అధికారుల మెప్పుకు ఈ తెగింపుకు పాల్పడ్డారు ఇటు అధికారులు, అటు కాంట్రాక్టర్లు. మొత్తానికి నగరంలో ఎవరిష్టం వచ్చినట్లు వాళ్లు డివైడర్లు కడుతుంటే పట్టించుకునేవారే లేకుండా పోయారంటే నెల్లూరులో ఎటువంటి రాజ్యం నడుస్తుందో అర్థం చేసుకోవచ్చు.

అవినీతి కథ

ఉపాధిహామీ పథకంలో బట్టబయలైన అవినీతి!

జిల్లాలోని మండలాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను సామాజిక తనిఖీలో భాగంగా పరిశీలిస్తే చిల్లకూరు, బాలాయపల్లి, వరికుంటపాడు, ఉదయగిరి, కలిగిరి, దగదర్తి, కొండాపురం మండలాల్లో కోటి రూపాయలు స్వాహా అయినట్లు తేటతెల్లమయ్యింది.


జిల్లాలో అమలవుతున్న జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం అధికారులు, సిబ్బందికి కల్పతరువుగా మారింది. ఈ పథకం అమలు కోసం విడుదల చేస్తున్న నిధులలో 50 శాతం వరకు దుర్వినియోగమవుతున్నాయి. గ్రామీణ ప్రాంత ప్రజలకు వంద రోజులు పనిదినాలు కల్పించి ఉపాధి కల్పించాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యానికి అధికారులు అధికారపార్టీ నేతల అండతో తూట్లు పొడుస్తున్నారు.

జిల్లాలోని 46 మండలాల్లో 961 గ్రామ పంచాయితీలలో ఈ పథకం అమలు జరుగుతోంది. ఈ పథకం ద్వారా ఖర్చు చేస్తున్న నిధులపై అనేక ఆరోపణలు రావడంతో సామాజిక తనిఖీలు జరిగాయి. ఈ తనిఖీలలో కోటి రూపాయల వరకు నిధులు ప్రక్కదారి మళ్లినట్లు అధికారులు గుర్తించడం జరిగింది. గతంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరక్టర్‌గా పనిచేసి బదలీపై వెళ్లిన రామచంద్ర హయాంలో అవినీతి, అక్రమాలకు బీజం పడింది.

ఈ పథకం అమలు కోసం మండల స్థాయిలో పనిచేసేందుకు నియమించిన ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు గ్రామ పంచాయితీ సర్పంచ్‌లతో కుమ్మక్కై నిధులు స్వాహా చేశారు. వీరి అక్రమాల గురించి కొందరు మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు తెలిసినా కూడా రాజకీయఒత్తిళ్ల కారణంగా చర్యలు తీసుకోలేకపోయారు. కూలీలు పనిచేసినా, పనిచేయకపోయినా మస్టర్ వేయడం, మరణించిన వారి పేర్లను నమోదు చేయడం వంటి పరిణామాలు చోటుచేసుకొంటున్నాయి.

డ్వామా పిడిగా ఇటీవల బాధ్యతలు తీసుకున్న జడ్పీ సిఇఓ రామిరెడ్డి అన్ని మండలాల్లో సామాజిక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. కొన్ని మండలాలకు ఆయనే స్వయంగా వెళ్లి రికార్డులను పరిశీలించడం జరిగింది. ఈ పరిశీలనతోపాటు కూలీలను పిలిపించి విచారణ చేపట్టారు. ఈ విచారణలో బహిర్గతమవుతున్న విషయాలను విని ఆశ్చర్యపోవాల్సి వస్తుంది. కూలీలకు చెందాల్సిన నగదును సిబ్బంది స్వాహా చేసినట్లు నిర్ధారణ జరిగింది.

జిల్లాలో చిల్లకూరు, బాలాయపల్లి, వరికుంటపాడు, ఉదయగిరి, కలిగిరి, దగదర్తి, కొండాపురం తదితర మండలాల్లో ఉపాధిహామీ పథకం నిధులు దుర్వినియోగం జరిగాయి. కోటి రూపాయలు దుర్వినియోగం పై మండలాల్లో జరిగితే మొత్తం 46 మండలాల్లో ఎన్ని రూపాయల నిధులు దుర్వినియోగం జరిగివుంటాయోనని అధికారులు అంచనా వేస్తున్నారు. దుర్వినియోగమైన నిధుల్ని రికవరీ చేయడంతోపాటు ఇందుకు బాధ్యులైన సిబ్బంది, మండలస్థాయి అధికారులపై కూడా చర్యలు తీసుకునే అవకాశం వుంది.



ఉపాధి పనులను పర్యవేక్షించని జిల్లా సాగునీటి నిర్వహణ సంస్థ కార్యాలయం.

వలసలు నియంత్రించి సంవత్సరానికి వంద రోజులు పని కల్పించాల్సిన మండలస్థాయి అధికారులు పూర్తిగా విస్మరిస్తున్నారు. నిధులు స్వాహా చేసేందుకే అధిక ప్రాధాన్యతనిస్తున్నారు. ఈ పథకం నిధుల్ని దిగమింగిన అక్రమార్కులపై ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

బద్మాష్ పెద్ద బండ!



✍ అల్లూరు రహీం

గాయకుడు, సంగీత దర్శకునిగా ఆంధ్రులకు సుపరిచితమైన వందేమాతరం శ్రీనివాస్‌ను దర్శకుని చేసి జి.పి.సిద్ధార్థ అకాడమీ నిర్మించిన చిత్రమే బద్మాష్. ఈ చిత్రం పేరుకు తగ్గట్టుగానే వుంది. బద్మాష్ పాత్ర పోషించిన హీరో నాగ సిద్ధార్థ ఈ చిత్ర నిర్మాత కుమారుడు. ఆయన గారి ముఖాన కళాకాంతి లేదు. కాని హీరోను చేయాలని ఆ తండ్రి తాపత్రయం. హీరోయిన్ ఏక్తా కూడా ఆకర్షణీయంగా లేదు. చిత్రంలో ప్రధాన పాత్ర ఇంజనీరింగ్ కాలేజి ప్రిన్సిపల్‌ది. దానిని నిర్మాత నాగయ్యగారే పోషించారు. పివి.గిరి వ్రాసిన కథలో కాసింత కొత్తదనం కూడా లేదు. కథాబలం, నటుల బలంలేని చిత్రం వందేమాతరం శ్రీనివాస్ చేతికి వచ్చింది. ఆయన పాటగాడే గాని దర్శకత్వంలో అనుభవం లేకపోవడం వల్ల బద్మాష్‌ను ఏ ప్రత్యేకతలు లేకుండా తెరకెక్కించి పారేశాడు. ఒక ఇంజనీరింగ్ కాలేజి ప్రిన్సిపల్ ఇంజనీరింగ్ చదివే పిల్లలను క్రమశిక్షణ పేరిట తలక్రిందులుగా వ్రేలాడదీసి, కొడతాడు. ఇది ఈ రోజుల్లో సాధ్యమా? ఇటువంటి కాలేజీలోని పిల్లలు ఓ లెక్చరర్‌కు పూలబొకే ఇచ్చి అందులో సిగరెట్లు తెప్పించుకొంటుంటారు. సిగరెట్లు తాగి పొగను బెలూన్‌లో పట్టి ఆకాశాన వదలు తుంటారు. సంతోషిమాత వ్రతం కాగితాలు, పిల్లల మాటలు తెలుసుకోను టేబుళ్ల క్రింద చిన్న స్పీకర్ల సన్నివేశాలు ఎప్పటివి? వీటి చిత్రీకరణ కూడా బాగోలేదు. అయితే దర్శకుడు సినిమాలోని పాటలన్నింటికి శ్రవణానందకరంగా సంగీతమందించాడు. నిన్నా మొన్నా, ఏం మాయ చరణాలతో సాగే పాటలను ఓ మోస్తరుగా చిత్రీకరించాడు. మందు గొప్పతనం తెలియజేసే మందుకొట్టు ఐటెం పాట అంత బాగోలేదు. వెలిగొండ శ్రీనివాస్ వ్రాసిన మాటల్లో నెల్లూరు ప్రస్తావన తెచ్చాడు. పొట్టిశ్రీరాములు, సుందరయ్య, గోపాలరెడ్డి, వెంకయ్యనాయుడు మొదలుకొని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిల పేర్లు ఓ కామెడీ బిట్‌లో వాడాడు. మరోచోట ప్రేమ స్వైన్‌ఫ్లూ లాంటిది. నిజాలు నమ్మలేనట్లు వుంటాయి. ఛానల్స్‌లో బూతు, పబ్‌ల సంస్కృతిని అడ్డుకోలేరు.... ప్రేమికుల దినోత్సవాన్ని ఎందుకు అడ్డుకొంటారని భజరంగదళ్ కార్యకర్తలపై విమర్శ పేల్చాడు.

చిత్ర సమీక్ష

ఇక చిత్రకథలోనికి వెళ్తే సిద్దార్థ్ ఇంజనీరింగ్ కాలేజి ప్రిన్సిపల్ నాగిరెడ్డి (నాగయ్య) క్యాంపస్‌లో క్రమశిక్షణ కోసం కఠిన చర్యలు తీసుకొంటుంటాడు. కాలేజీలోని ఓ అమ్మాయిని కలవను వచ్చిన ప్రక్క కాలేజి అబ్బాయి వుదంతం పసిగట్టే ప్రిన్సిపల్ ఆ అమ్మాయి ప్రతి క్లాస్‌కు వెళ్లి ప్రేమించాను... తప్పు చేశానని చెప్పిస్తాడు. దీన్ని ఆమె భరించలేక మత్తు మాత్రలు మింగినా పట్టించుకోడు. ఇటువంటి కాలేజీలో తాను చదివిన కాలేజీల్లో అందరిచేత బద్మాష్ అనిపించుకొనే అవినాష్ (నాగ సిద్దార్థ్) వచ్చి చేరుతాడు. తొలిరోజే ఈ కాలేజీలోనే చదివే ప్రిన్సిపల్ కుమార్తె అమృత (ఏక్తా)కు అతనికి తగువు పడుతుంది. అవినాష్ అతి వినయంతో ప్రిన్సిపల్‌తోపాటు లెక్చరర్ రామబ్రహ్మం (ధర్మవరపు సుబ్రహ్మణ్యం)ను బుట్టలో వేస్తాడు. కాలేజి ప్రిన్సిపల్ విపరీత ప్రవర్తన వల్ల ఆత్మహత్య చేసుకోబోయిన విద్యార్థిని వల్ల అమృత ప్రేమ విలువ తెలుసుకొంటుంది. అవినాష్‌తో ప్రేమలో పడుతుంది. ఫోన్‌లో కుమార్తె ప్రియునితో మాట్లాడడం ఒకరోజు విన్న నాగిరెడ్డి రగిలిపోతాడు. ఆ ఫోన్ ఎత్తి అవినాష్‌ను అంతు చూస్తానంటాడు. అవినాష్ అసలు తనెవరో తెలుసుకోమని ఛాలెంజ్ విసురుతాడు. ప్రక్క కాలేజీలోని శాడిస్ట్ ప్రేమికుడు ప్రసాద్ అమృతను ప్రేమించమని ఒత్తిడి చేయడంతో అతన్ని అవినాష్ చావచితక కొడతాడు. అతను అవినాష్‌ను కొట్టను అవకాశం ఎదురుచూస్తుంటాడు. అంతిమంగా ప్రిన్సిపల్ నాగిరెడ్డి తన కుమార్తెను ప్రేమించినది అవినాష్ అని తెలుసుకొంటాడు. ఈ విషయాన్ని కాలేజి స్పోర్ట్స్ మీట్‌లో పబ్లిక్‌గా చెప్పి అతన్ని చావగొట్టాడు. ఈ అవమానాన్ని తట్టుకోలేని అవినాష్ తండ్రి (సుమన్) అతన్ని బెంగుళూరుకు తీసుకెళ్లను సిద్ధపడతాడు. ఈ సమయంలో సిద్దార్థ ఇంజనీరింగ్ కాలేజి శాడిస్ట్ ప్రసాద్ చదివే కాలేజి చేతిలో హాకీ ఆటలో ఓడిపోబోతుంది. కాలేజి విద్యార్థుల ఒత్తిడిమేరకు ప్రిన్సిపల్ కాస్త తగ్గి అవినాష్‌ను స్వయంగా పిలుచుకొని రావడంతో అతను జీవన పోరాటం చేసి మ్యాచ్‌ను గెలిపిస్తాడు. ప్రిన్సిపల్ మనిషికి ఏదో ఆటలో ప్రవేశం వుండాలన్న సందేశం ఇస్తూ బద్మాష్‌ను తన కుమార్తెకు ఇచ్చి పెళ్లి చేయడంతో చిత్రం ముగుస్తుంది. టైమ్ పాస్ కూడా కాని ఈ చిత్రానికి వెళ్లను ఒకటికి మూడుసార్లు ఆలోచించాల్సిందే!

శ్రియ సంతోషం



ఐదేళ్ల క్రితం తెలుగులో భగీరథ చిత్రంలో నటించిన శ్రియకు చాలా గ్యాప్ తర్వాత వచ్చిన ఏకైక అవకాశం డాన్‌శీను. మధ్యలో ఐటెమ్ గీతాలు, అనువాద చిత్రాల్లో కనిపించినా తెలుగు ప్రేక్షకులు పట్టించుకోలేదు. డాన్‌శీనులో పొట్టి దుస్తులతో ఆమె హీరోతో కలసి పాడిన పాటలు, ఒలకబోసిన వయ్యారాలకు మంచి స్పందన రావడంతో శ్రియ సంతోషంగా వుంది. ఈ ఉత్సాహంతో కొమరం పులి చిత్రంలోనూ ఒక ప్రత్యేక గీతంలో కనపడుతుంది. విజయవంతమైన డాన్‌శీను తెలుగులో మళ్లీ అవకాశాలు తెచ్చి ఇస్తుందన్న ఆశాభావాన్ని శ్రియ వ్యక్తం చేసింది.

విద్యాబాలన్ కలల రాకుమారుడు



పరిణీత చిత్రంతో బాలీవుడ్‌లో అందరి మనసులు దోచిన భామ విద్యా బాలన్. లగేరహో మున్నాభాయ్, సలామ్ ఎ ఇష్క్, భూల్ భూలయా చిత్రాలు యువతలో ఆమెకు పెద్ద గుర్తింపు తెచ్చి పెట్టాయి. తన కలల రాకుమారుడిని గూర్చి ఆమె వివరిస్తూ సగటు అమ్మాయిలు తనకు కాబోయే వాడి గూర్చి కలగన్నట్లుగా మేము కంటాం. నేను చాలా సార్లు ఊహల్లో విహరించా. ఎన్నో రొమాంటిక్ సన్నివేశాల గూర్చి ఊహించుకొన్నా. నేనొక కల గన్నాను. ఒకతను నేను నటించిన సినిమాలో పాటను ఈలగా వేస్తున్నాడు. అతను చాలా అందంగా వున్నాడు. నా మనసుదోచాడు. కిక్కిరిసిన క్రికెట్ స్టేడియంలో తన కోసమే కూర్చొన్నా. తను నా వంక ఎప్పుడు చూస్తాడా అని ఎదురుచూస్తున్నా. కాని ఎంతకీ నన్ను చూడలేదు. నిద్ర మేల్కొన్నాక ఇప్పటికీ ఆ ఆవేదన నన్ను తియ్యటి బాధకు గురి చేస్తుందని చెప్పుకొచ్చింది విద్యా బాలన్. విరహవేదన అని ఊరకే అన్నారా పెద్దలు...

మహాచెడ్డ పాత్రలో నమిత



ఇటీవల హైదరాబాద్‌లోని ఫిట్‌నెస్ సెంటర్లలో కనపడుతున్న నమితను పలుకరిస్తే నేను మంచిదాన్ని కాదంది. అదేమిటమ్మా అంటే త్వరలో నేను ధరించబోయే పాత్ర ఆవిధంగా వుంటుందంది. ఓ తమిళచిత్రంలో వ్యాంప్‌గా కనిపించబోతున్నాను. అది అట్లాంటిట్లాంటి వ్యాంప్ పాత్ర కాదు. అందులో నేను మహా చెడ్డదానిలా కనిపిస్తాను. ఇదివరకు కొన్ని సినిమాల్లో వ్యాంప్‌గా కనిపించి వుండొచ్చు. కానీ ఈసారి మరింత చెడ్డ దానిలా కనిపిస్తాను. ఆ పాత్రలో నన్ను చూసి చాలా మంది తిట్టుకొంటారు. ఏమండోయ్ పోషించే పాత్ర వరకే చెడ్డదాన్ని. బయట నేను చాలా మంచి దాన్నంటుంది ఈ బొద్దు సుందరి.

నటినవుతాననుకోలేదు!



వేదం చిత్రంలో వేశ్య పాత్రలో జాణతనం ఒలకబోసి ప్రేక్షకులకు ఇంకాస్త దగ్గరైన ముద్దుగుమ్మ అనుష్క ప్రస్తుతం మహేష్‌బాబు సరసన నటిస్తుంది. షూటింగ్‌గ్యాప్‌లో పిచ్చాపాటీగా మాట్లాడుతూ కొన్నేళ్ల క్రిందట సినిమాలంటేనే ఆమడ దూరంలో వుండే నేను సినిమాల్లోకి రావడమే ఆశ్చర్యం. ఏదైతే మనం వద్దనుకొంటామో అది రావడమే జీవితం. సినిమాల్లోకి వచ్చాక దాని విలువేంటో తెలిసింది. ప్రజలు తొందరగా ప్రభావితమయ్యేది సినిమాల ద్వారానే. నేను అగ్ర కథానాయికనని ఎప్పుడూ అనుకోను. తొలి సినిమాలో నటిస్తున్నప్పుడు ఎలా వున్నానో ఇప్పుడు అలానే వున్నాను. ఈ హోదాలు, దర్పాలు కొంతకాలమే. ఇది తెలుసుకొని మసలు కొంటే పరిశ్రమలో సమస్యలు దరిచేరవంటుంది ఈ బెంగుళూరు భామ.

ఏజ్‌బార్ హీరోలతో చేయను!



బాలకృష్ణ హీరోగా దాసరి నారాయణరావు దర్శకత్వంలో పరమ వీరచక్ర చిత్రం తయారవుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో హీరోయిన్‌గా కాజల్‌ను పెడదామని నిర్మాత సి.కళ్యాణ్ ఆమెను సంప్రదించాడు. ప్రస్తుతం ఆమె తీసుకొంటున్న కోటి పాతికలక్షల రూపాయల పారితోషికం కూడా ఇస్తానన్నాడట. ముందుగా బిజీగా వున్నాను. కాల్షీట్లు సర్దుబాటు చేయలేను అని చెప్పిందట. వీలైన సమయంలో నటించమని కళ్యాణ్ వత్తిడి చేయగా సార్ పెద్ద హీరోలు (ఏజ్‌బార్) సరసన నటించకూడదని నిర్ణయం తీసుకొన్నానందట. దీంతో మరో మార్గం లేక అనుష్కను బుక్ చేశాడు కళ్యాణ్.

కొలిక్కివస్తున్న ఆంధ్రాబ్యాంకు స్కాం!

ఆరు నెలలకు క్యాషియర్ తనంతట తాను దొరికాడు.



గబ్బుపట్టిన చిన్నబజారు ఆంధ్రాబ్యాంకు.

దొంగలు పడ్డ ఆరు నెలలకు... అన్న చందంగా వుంది చిన్నబజారు ఆంధ్రాబ్యాంకులో అవినీతికి పాల్పడి లక్షలు స్వాహాచేసిన క్యాషియర్ కృష్ణయ్యను అరెస్ట్ చేసిన వ్యవహారం. ఆరు నెలల క్రిందట ఖాతాదారులకు తెలియకుండా వారి సొమ్మును దిగమింగిన వ్యక్తిని అరెస్టు చేయడంలో పోలీసులు వ్యవహరించిన తీరు విమర్శలకు తావిచ్చింది. లక్షలు స్వాహాచేసిన బ్యాంకు ఉద్యోగి రాష్ట్ర రాజధానిలో మకాం పెట్టి బెయిల్‌కు ప్రయత్నిస్తున్నాడని తెలిసినా అతన్ని అరెస్టు చేయలేకపోవడంపై పెద్ద ఎత్తున డబ్బులు పోలీసులకు అందడమే కారణమని తెలుస్తుంది. ఆరు నెలలపాటు తటపటాయించిన పోలీసులు కృష్ణయ్యను అరెస్ట్ చేసినట్లు చూపించారు. ఈ స్కాంకు సంబంధించిన వివరాలు ఇలా వున్నాయి.

మన్సూర్‌నగర్‌కు చెందిన లక్కాకుల వెంకట కృష్ణయ్య చిన్నబజారు బ్రాంచిలో క్యాషియర్‌గా పని చేస్తుండేవాడు. ఐదేళ్లుగా ఇక్కడ పనిచేస్తుండిన కృష్ణయ్య లక్షలు దిగమింగాలన్న పన్నాగంతో గుట్టు చప్పుడు కాకుండా ఆయా ఖాతాలలోని సొమ్మును ఫోర్జరీ సంతకాలతో పలురకాల జిమ్మిక్కులు చేసి దాదాపు 40 లక్షల రూపాయల మేర స్వాహా చేశాడు. పలుసార్లు కృష్ణయ్య ప్రవర్తనపై పలువురు ఖాతాదారులు ఫిర్యాదు చేసినా బ్యాంకు సిబ్బంది అతన్ని హెచ్చరించి వదిలేయడంతో లక్షలు దిగమింగాడు. వివిధ ఖాతాల్లో ఫోర్జరీ సంతకాలతో పెద్ద మొత్తం స్వాహా చేసినట్లు బ్యాంకు సిబ్బంది గుర్తించినప్పటికీ ఆ విషయాన్ని బయట పడనీయకుండా త్రొక్కిపెట్టి డబ్బులు తిరిగి చెల్లించేస్తానని వ్రాత పూర్వకంగా వెంకటకృష్ణయ్య చేత వ్రాయించుకొన్న బ్యాంకు అప్పటి మేనేజర్ సర్వమంగళ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇదంతా అటుంచితే అసలు చిక్కు ఖాతాదారులకు వచ్చి పడింది. బ్యాంకులో అవకతవకలు జరిగినపుడు వాటితో సంబంధం లేకుండా ఖాతాదారులకు వారి వారి సొమ్ము చెల్లించాలన్న నిబంధన వున్నప్పటికీ ఇంతవరకు ఒక్కరికి కూడా చెల్లింపులు జరుగలేదు. దీనిపై పలుమార్లు బ్యాంకు అధికారులను కలిసినా ఖాతాదారుల గురించి పట్టించుకోవడంలేదు. పలు కేసులను ఛేదించిన ఎస్పీ గారైనా ఈ విషయంలో చొరవ చూపి తమకు న్యాయం చేయాలని తమ డబ్బును తిరిగి ఇప్పించాలని ఖాతాదారులు కోరుకొంటున్నారు.

కొరవడుతున్న పోలీసు నిఘా

పాత నేరస్తులు, జైలు నుంచి విడుదలయ్యే నేరస్తుల పట్ల పోలీసుల నిఘా కొరవడడంతో దొంగతనాలు, దోపిడీలు పెచ్చుమీరుతున్నాయి. జిల్లావ్యాప్తంగా 500 మందికి పైగా పాత నేరస్తులు పోలీసు రికార్డులలో వున్నారు. వీరు ప్రస్తుతం ఏమి చేస్తున్నారు. వీరి కదలికలేమిటి అన్న దానిపై ఆయా స్టేషన్ల పరిధిలో పోలీసులు నిఘా వుంచాలి. దీనికి సంబంధించి ఎస్పీ సంబంధిత పోలీస్ స్టేషన్లకు ఆదేశాలు జారీచేసి వున్నప్పటికీ అవి అమలు కావడం లేదు. జైలులో శిక్షాకాలం పూర్తిచేసుకొని విడుదలవుతున్న వారి జాబితా పది రోజుల ముందుగానే పోలీసులకు చేరుతుంది. దీనిని బట్టి ఆయా వ్యక్తులపై నిఘా వుంచాల్సి వుంటుంది. కానీ ఎక్కడా స్థానిక పోలీసులు పాత నేరస్తుల కదలికల గురించి పట్టించుకోకపోవడంతో ఇటీవలకాలంలో పెద్ద ఎత్తున దొంగతనాలు జరిగేందుకు కారణమయ్యాయన్నది నిజం. సిసిఎస్ పోలీసులు, రేంజ్ క్రైం స్క్వాడ్

నగరంలో ఆగని దొంగతనాలు

సిబ్బంది పనిచేస్తున్నప్పటికీ పోలీసుల మధ్య సమన్వయం కొరవడడం మరొక కారణంగా తెలుస్తుంది. ఇప్పటికైనా ఎస్పీ ఆదేశాలు అమలయ్యేలా పాత నేరస్థులపై నిఘా ముమ్మరం చేసినట్లయితే కొంతమేర నేరాలు తగ్గు ముఖం పట్టే అవకాశం వుంది.

గాడిలో పడని విద్యాశాఖ!

జిల్లా అధికారుల నుంచి రాష్ట్రస్థాయి అధికారులు జిల్లా విద్యాశాఖను గాడిలో పెట్టేందుకు ఎన్ని హెచ్చరికలు జారీచేసినా ఎన్ని హితోక్తులు చెప్పినా దాని తీరు మారడం లేదు. రాబందుల్లా మారిన విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది ఒకవైపు, బడికి ఎగనామం పెట్టి సొంత వ్యాపారాలు చక్కబెట్టుకొంటున్న ఉపాధ్యాయులు మరోవైపు, రెగ్యులర్ విద్యాశాఖాధికారులు లేక 23 మండలాల్లో గాడి తప్పిన పాలన ఇంకో వైపు వెరసి విద్యార్థుల భవిష్యత్తును, పాఠశాలలను నిర్వీర్యం చేస్తున్నాయి. ఇటీవల జిల్లా కలెక్టర్ రాంగోపాల్ బడికిరాని ఉపాధ్యాయులపై కొరడా ఝుళిపించమని మండల విద్యాశాఖాధికారులను ఆదేశించిన వారు అందుకు సిద్ధపడక పోవడం వెనుక గాడితప్పిన పాలనే కారణమని చెప్పక తప్పదు. పలు మండలాల్లో మండల విద్యా శాఖాధికారుల పోస్టులకు ఇన్‌ఛార్జిలుగా హెడ్‌మాస్టర్లను నియమించారు. చాలా చోట్ల ఈ బాధ్యతలను చేపట్టేందుకు అధికశాతం మంది విముఖత చూపారు. ఈ పరిస్థితుల్లో కొందరు సీనియర్లను నియమించినప్పటికీ చాలా చోట్ల వీటిలో పైరవీలు, రాజకీయ పలుకుబడులు చోటుచేసుకోవడంతో ఇన్‌ఛార్జి ఎంఇఓలుగా గతంలో సస్పెన్షన్‌కు గురైనవారు అవినీతిపరులుగా పేరుబడ్డవారు పనిచేస్తున్నారు. కోటలో ఎంఇఓగా బాధ్యతలు నిర్వర్తిస్తూ చలపతి మూడు సార్లు సస్పెండై వున్నాడు. ఉదయగిరిలో ఇన్‌ఛార్జి ఎంఇఓగా వున్న ఓబుల్‌రెడ్డి మేకపాటి శేఖర్‌రెడ్డి రెకమండేషన్‌పై వచ్చాడు. ఆయన ఇందిరమ్మ ఇళ్లు, ఉపాధి హామీ పనులు చేసుకోవడంలో తలమునకలై వుంటాడట. ఆయనకు మండలంలో పాఠశాలల స్థితిగతులు పరిశీలించే తీరిక వుండదు. వెంకటగిరి ఎంఇఓగా వున్న శ్రీనివాసులు గతంలో అల్లూరు బోర్డు స్కూల్లో పనిచేసేటపుడు బియ్యం తిని ఆరు నెలలు సస్పెండ్‌కు గురై వున్నాడు. మరికొందరు ఎంఇఓలు ఎప్పుడూ మత్తులో జోగుతుంటారట. ఈ ప్రభావం విద్యార్థుల పాలిట శాపంగా మారింది. విద్యాశాఖ గాడి తప్పింది. ఇంత జరుగుతున్నా ఒక్కరూ పట్టించుకోకపోవడంతో అస్తవ్యస్తంగా మారింది.

కల్లుగీత కార్మికుల గురించి పట్టించుకోవడం లేదు!



టౌన్‌హాల్‌లో జరిగిన కల్లుగీత కార్మికుల సభలో మాట్లాడుతున్న డోన్ ఎమ్మెల్యే కె.ఇ.కృష్ణమూర్తి. వేదికపై నరసింహులు గౌడ్, దయాకర్ గౌడ్ తదితరులు.

నెల్లూరు నగరంలో ఈ నెల 19వ తేది టౌన్‌హాల్‌లో జిల్లా గౌడ్ సంక్షేమ సంఘం మహాసభ ఘనంగా జరిగింది. జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో కల్లుగీత కార్మికులు ఈ సభకు తరలి వచ్చారు. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన డోన్ శాసనసభ్యులు కె.ఇ. కృష్ణమూర్తి గౌడ్‌ల సంక్షేమం గురించి ప్రభుత్వం అవలంభిస్తున్న మొండి వైఖరిని ఎండగట్టారు. కల్లుగీత కార్మికుల సంక్షేమం కోసం పలు పథకాలు అమలు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం తర్వాత చేతులెత్తేసిందని దుయ్యబట్టారు. గ్రామీణ ప్రాంతాలలో కల్లుగీత కార్మికులు దుర్భర జీవనం సాగిస్తున్నారని వీరికి ఆర్థికంగా చేయూతనివ్వాల్సిన అవసరం వుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ఎక్సైజ్ శాఖ చీప్‌లిక్కర్‌కు ఇస్తున్న ప్రాధాన్యత కూడా కల్లుగీత కార్మికులకు ఇవ్వడంలేదని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారం చేపట్టినా కూడా గీత కార్మికుల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. కులానికి సాయపడని వారు సమాజానికి ఏం చేయగలరు? అన్న ఆలోచనతో తాను గౌడ్ సంఘంలో అధ్యక్ష పదవి చేపట్టి తోటి కులస్తుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నట్లు చెప్పుకొచ్చారాయన. కల్లు గీత కార్మికుల సొసైటీకి ప్రభుత్వం ఐదెకరాల భూమిని కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మహాసభకు గౌడ్ సంఘం జిల్లా అధ్యక్షుడు అన్నం దయాకర్‌గౌడ్ అధ్యక్షత వహించగా పలువురు గౌడ్ సంఘం నాయకులు పాల్గొని ప్రసంగించారు.

ప్రశంసాపత్రాలపై విమర్శల జల్లు!

జిల్లాలో ప్రతి సంవత్సరం వివిధ ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది అందించిన సేవలకు గుర్తింపుగా ప్రశంసాపత్రాలు అందిస్తారు. వీటిని గణతంత్ర దినోత్సవం, స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మంత్రులు, జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందించడం జరుగుతుంది. ప్రభుత్వ శాఖలతోపాటు ప్రభుత్వ రంగ సంస్థలలో పనిచేస్తున్న వారికి కూడా అందిస్తారు. ప్రశంసాపత్రాలకు ఎంపిక చేసే విధానంలో సంబంధిత శాఖల అధికారులు సరైన పరిశీలన జరపడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ శాఖల పరంగా ప్రజలకు అవసరమైన సేవలుగాని, ప్రభుత్వ కార్యక్రమాలు అమలుచేసే విధానంలో చిత్తశుద్ధి కనబరచక పోయిన వారిని సైతం ప్రశంసాపత్రాలకు ఎంపిక చేస్తున్నారు. ఈ ఎంపిక విధానంపై అసంతృప్తిగా వున్న కొందరు అధికారులు బహిరంగ విమర్శలు చేయలేక పోయినా, అంతర్గతంగా చర్చించుకుంటున్నారు. వివిధ శాఖల నుంచి వచ్చిన జాబితాను కలెక్టరేట్ అధికారులు ఆమోదిస్తున్నారు. విమర్శలు, ఆరోపణలు, నిధుల దుర్వినియోగానికి పాల్పడిన వారికే అధిక ప్రాధాన్యత నిస్తున్నారని చర్చ జరుగుతుంది. వివిధ శాఖల అధికార్లు తమకు అన్నివిధాలుగా అనుకూలంగా వ్యవహరిస్తున్న వారి పేర్లను ప్రశంసాపత్రాలు అందించేందుకు సిఫార్సు చేస్తున్నారు తప్ప విధి నిర్వహణను పరిగణనలోకి తీసుకోవడం లేదు. దీంతో అనేక మందికి సంవత్సరాల తరబడి ప్రశంసాపత్రాలకు నోచుకోలేక పోతున్నారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పరిధిలో 17 ఐసిడిసిఎస్ ప్రాజెక్టులు వున్నాయి. వీటిలో 17 మంది సిడిపిఓలు, వంద మంది వరకు సూపర్ వైజర్లు, మూడు వేల మంది వరకు అంగన్‌వాడీ వర్కర్లు విధులు నిర్వ

కలక్టరేట్ పరిశీలించకపోతే ఎలా?

హిస్తున్నారు. అయితే ప్రాజెక్ట్ డైరక్టర్ శారద పొదలకూరు ఐసిడిసిఎస్ సిడిపిఓ సత్యకుమారి పేరును మాత్రమే సిఫార్సు చేశారు. ఇలా చేయడానికి కారణం పిడి సిడిపిఓ ఒకే సామాజిక వర్గానికి చెందినవారు కావడమేనని ఆ శాఖ ఉద్యోగులు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ నెల 15వ తేది నగరంలో పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మంత్రి ఆమెకు ప్రశంసాపత్రాన్ని అందించడం జరిగింది. ప్రశంసాపత్రాలపై కలక్టరేట్ పరిశీలన జరపాల్సి వుంది.

సుబ్బరామరెడ్డి

మొదటి పేజీ కొరవ

2020 నాటికి మన దేశంలో కనీసం 20వేల మెగావాట్ల అణు విద్యుత్ ఉత్పత్తి చేయాలని ప్రధాని మన్మోహన్‌సింగ్ లక్ష్యం. ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాలన్నీ తమ విద్యుత్ అవసరాలలో 30శాతం వరకు అణు విద్యుత్ ద్వారా పూరించుకొంటున్నాయి కాబట్టి, ఈ రంగంలో భారతదేశం కూడా వాటితో సమానంగా నిలవాలన్నది ఆయన అభిలాష. అందుకోసం రెండేళ్ల క్రితం అమెరికాతో అణు ఒప్పందం చేసుకొన్నారు. దానికి కొనసాగింపుగా అణు జవాబుదారీ చట్టాన్ని తయారు చేయాల్సి వచ్చింది. అణు విద్యుత్ కేంద్రాలకు అవసరమైన రియాక్టర్లు, ఇతర యంత్ర పరికరాలు తయారుచేసే సాంకేతిక పరిజ్ఞానం మన దేశంలో లేదు. అమెరికా, కెనడా, ఫ్రాన్స్, రష్యా వంటి దేశాల నుంచి వాటిని దిగుమతి చేసుకోవాలి. వీటిలో ప్రధానమైనది అమెరికా. అణు విద్యుత్ కేంద్రాలు అత్యంత ప్రమాదకరమైనవి. ఏ చిన్న పొరపాటు జరిగినా, అణు పదార్థాలు గాలిలో వ్యాపించి, ప్రజల ప్రాణాలు తీస్తాయి. ఆ వ్యాప్తి ఎంత దూరం వుంటుందో, ఆ ప్రాణ నష్టం ఎంత విస్తారంగా వుంటుందో ఎవరూ వూహించలేరు. రష్యాలోని చెర్నోబిల్ అణు విద్యుత్ కేంద్రంలో గతంలో జరిగిన ఒక ప్రమాదం దీనికి ఉదాహరణ. భవిష్యత్తులో భారతదేశంలో ఇటు వంటి ప్రమాదాలు జరిగితే తమ బాధ్యత లేదని చట్టం చేస్తే తప్ప తాము రియాక్టర్లను సరఫరా చేయబోమని అమెరికా వ్యాపారసంస్థలు షరతు పెట్టాయి. అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా రేపు నవంబర్‌లో భారతదేశం రానున్నారు. ఆ లోగా ఈ చట్టాన్ని ఆమోదింప చేయాలన్నది ఆయన కోరిక. మొన్న మార్చి నెలలో మన్మోహన్ సింగ్ ఈ చట్టాన్ని బిల్లు రూపంలో లోక్‌సభలో ప్రవేశపెట్టాలని ప్రయత్నించారు. అయితే దాని ఆమోదానికి కావల్సిన సంఖ్యాబలం యుపిఏ ప్రభుత్వానికి లేదు. లోక్‌సభలో కాంగ్రెస్‌కు, మద్దతిస్తున్న స్వతంత్రులతో కలిపి కేవలం 239 మంది సభ్యులు మాత్రమే వున్నారు. మిత్రపక్షాలైన బహుజన సమాజ్ పార్టీ (21), సమాజ్‌వాది పార్టీ (22), లల్లూ ఆర్జేడి (4)లు ఈ బిల్లులో కొన్ని మార్పులు కోరాయి. బిజెపి, కమ్యూనిస్టు పార్టీలు బిల్లును వ్యతిరేకిస్తున్నాయి. అందువల్ల చివరి నిముషంలో బిల్లు ప్రవేశపెట్టకుండా వెనక్కుతగ్గి, స్టాండింగ్ కమిటీ పరిశీలనకు పంపారు. ఆ కమిటీకి టి.సుబ్బరామరెడ్డి అధ్యక్షుడు. బిల్లు ఆమోదానికి ఎట్లయినా బిజెపి, కమ్యూనిస్టులను ఒప్పించాలన్నది సుబ్బరామరెడ్డి మీద ప్రధాని పెట్టిన బాధ్యత.

ఒబామా వచ్చే లోపల ఈ బిల్లు ఆమోదం పొందకుంటే, ప్రధాని మన్మోహన్ సింగ్ పరువు పోయేది. తాను చేసిన హామీలను చట్టరూపంలోకి తేలేక పోయాడనే నింద పైనపడేది. ప్రధాని పరువు పోవడమంటే, దేశం పరువు పోవడమే కదా? అంత సున్నితమైన సమస్యను చాకచక్యంగా పరిష్కరించి, తన సమర్థతను రుజువు చేసుకొన్నాడు టిఎస్ఆర్.

సిద్ధాంతపరమైన విభేదాలు వున్న పార్టీలను, సున్నితమైన జాతీయ అంశంపై ఏకాభిప్రాయానికి ఒప్పించడం ఎంత కత్తి మీద సామో వివరించి చెప్పనవసరం లేదు. ఆ క్లిష్టమైన బాధ్యతను ఎంతో నేర్పుగా, లౌక్యంగా పరిష్కరించాడు సుబ్బరామరెడ్డి. ఈ నాలుగు నెలల కాలంలో ఆయన 24సార్లు కమిటీ సమావేశం జరిపాడు. దాదాపు 100 మంది అణు రంగ నిపుణులను ఆ సమావేశాలకు పిలిపించి, బిజెపి వంటి పార్టీలకున్న ఆక్షేపణలపై వివరణ ఇప్పించారు. బిజెపి, కమ్యూనిస్టు పార్టీల జాతీయ నాయకులను వ్యక్తిగతంగా కలిసి, గంటల తరబడి నచ్చ చెప్పారు. సాంకేతిక అంశాలలో సందేహాలను తొలగించారు. అంతర్జాతీయ సంబంధాలలో భారత ప్రభుత్వం నిర్వర్తించవలసిన దౌత్యపరమైన బాధ్యతలను విప్పి చెప్పారు. ఆయన వాదనా పటిమకు సంతృప్తి చెందిన జాతీయ పార్టీలు, చిట్ట చివరకు అణు జవాబుదారీ బిల్లు ఆమోదానికి సమ్మతి తెలిపాయి.

ఈ పార్లమెంటు సమావేశాలలోగా బిల్లు ఆమోదం పొందుతుందా లేదా అన్న ఉద్విగ్నంలో వుండిన ప్రధాని మన్మోహన్‌సింగ్ బిజెపి అందుకు సమ్మతించిందని తెలియగానే ఆనందం పట్టలేకపోయారు. కాశ్మీర్ పర్యటనలో వున్నప్పుడు ఈ విషయం తెలుసుకొన్న ఆయన అక్కడ నుంచే సుబ్బరామరెడ్డికి ఫోన్ చేసి తన ఆనందాన్ని, అభినందనలను తెలియజేశాడు. కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ, పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో సుబ్బరామరెడ్డిని కలిసి ప్రశంసించారు. దానితో పార్లమెంట్ వర్గాలలో సుబ్బరామరెడ్డి స్థాయి ఒక్కసారిగా ఆకాశమంత ఎత్తుకు పెరిగిపోయింది.



ఆంధ్రాబ్యాంక్ యాజమాన్యం అనుసరిస్తున్న వుద్యోగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నెల్లూరులో ధర్నా చేస్తున్న ఆ బ్యాంకు వుద్యోగులు.

అయోమయంలో జగన్

మొదటి పేజీ కొరవ

కోపం తన్నుకొని వచ్చింది. నీ భర్త ఓదార్పు యాత్రతో సంబంధం పెట్టుకొన్నట్లు నా దగ్గర సమాచారం వుందని గట్టిగా కేకలేశారట. దానితో ఉలిక్కిపడిన పనబాక, ప్రకాశం జిల్లాలో యాత్ర నుంచి ఎమ్మెల్యేలను దూరం చేయడానికి తానే నడుం కట్టుకొన్నారు. మరొక ఎమ్పీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ఆమెకు సహకారం అందజేస్తున్నారు. వీరిద్దరూ కలిసి అహ్మద్ పటేల్‌తో సంభాషణలు జరిపి, ప్రకాశం జిల్లా నుంచి 8మంది ఎమ్మెల్యేలను ఢిల్లీకి పిలిపించారు. జగన్ వద్దకు పంపి యాత్ర మానుకొమ్మని సలహా ఇప్పించారు. దానికి జగన్ మండిపడ్డాడు. మీరెవరు నాకు చెప్పడానికని చిర్రు బుర్రులాడారు. ఆ వెంటనే అహ్మద్ పటేల్ దగ్గరకు తీసుకవెళ్లారు వీరిని. ఆయన అధిష్టానం అభిమతాన్ని తేల్చి చెప్పారు.

ఈ సందేశం ఒక్క ప్రకాశం జిల్లాకు పరిమితం కాదు. మొత్తం రాష్ట్రానికి సంకేతం. జగన్‌తో సంబంధాలు నెరపుతున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్‌వాదులు ఇప్పుడు తమ పోకడపై ఒక నిర్ణయానికి వచ్చి తీరాలి. అటో ఇటో ఏదో ఒక మార్గం ఎంచుకోవాలె తప్ప రెండు పడవల మీద కాలుపెట్టి ప్రయాణం చేయడం కుదరని పని.

అయితే ఇక్కడొక విషయం గమనించాలి. జగన్ పట్ల అధిష్టానం ఎంత స్పష్టంగా వుందో, అధిష్టానం పట్ల జగన్ కూడా అంతే స్పష్టంగా వున్నాడు. సోనియాగాంధీ నేరుగా వచ్చి రోడ్డుకు అడ్డం పడుకొన్నా, ఓదార్పు యాత్ర ఆపేది లేదన్నది జగన్ మనోగతం. కాంగ్రెస్‌లో వుండాలన్న కోరిక కూడా ఆయనలో లేదు. అయితే తనంతట తానుగా పార్టీ నుంచి బయటకు వెళ్లకుండా, అధిష్టానం పంపితే వెళ్లాలన్నది వ్యూహం. దాని ద్వారా, వైఎస్ కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ వేధిస్తున్నదన్న సానుభూతితో ప్రజలను ఆకట్టుకోవచ్చు. అయితే అధిష్టానం కూడా జగన్‌ను అంత సులభంగా బయటకు పంపే ఉద్దేశంలో లేదు. పొమ్మనకుండా పొగ పెట్టాలన్నది వారి వ్యూహం.

ముహూర్తం ఎప్పుడన్నది ప్రశ్న తప్ప, జగన్ కాంగ్రెస్‌లో వుండడన్నది తేలిపోయింది. బయటకు పోయి ఏమి చేస్తాడు? యాభై అరవై మంది ఎమ్మెల్యేలను కూడగట్టుకొని, రోశయ్య ప్రభుత్వాన్ని కూలగొడితే, వెంటనే ఎన్నికలు వస్తాయి కాబట్టి, తాను అతి త్వరలో ముఖ్యమంత్రి అయిపోవచ్చునని కలలు కన్నాడు. కానీ యాభై మంది సంగతి దేముడెరుగు అందులో సగం మంది కూడా నికరంగా నిలబడే సూచనలు కన్పించడం లేదు. అందరికంటే ముందు జగన్ పక్షంగా నిలవవలసిన కెవిపి రామచంద్ర రావే, అధిష్టానం ఆశ్రయంలో వున్నప్పుడు ఏ ఎమ్మెల్యే వస్తాడు? ఏ మంత్రి సాహసిస్తాడు? సరైన బలం లేకుండా పార్టీ నుంచి బయటకుపోతే, సాధించేది ఏముంది? రోశయ్య ప్రభుత్వాన్ని ఇప్పుడు పడగొట్టలేకపోతే, మరొక మూడున్నరేళ్లు ఆయన నిక్షేపంగా గద్దె మీద కూర్చునే వుంటాడు. అంత కాలం జనంలో వైఎస్ పట్ల సానుభూతి నిలుస్తుందా, జగన్ పట్ల మోజు మిగులుతుందా? జగన్‌తో నలభై మంది వెళ్లినా, రోశయ్య ప్రభుత్వానికి ఇబ్బంది ఎదురుకాదు. చిరంజీవి (18), టిఆర్ఎస్ (11), మజ్లిస్ (8)లు రోశయ్యకు మద్దతు ఇవ్వడానికి సిద్ధంగా వున్నాయి. జగన్‌తో వెళ్లే ఎమ్మెల్యేల సంఖ్య యాభై దాటితేనే ప్రభుత్వానికి చిక్కు వస్తుంది. అది జరిగే అవకాశమే కన్పించడం లేదు.

సరైన సంఖ్యాబలం లేకుండా తొందరపడితే, జగన్ శక్తి మొత్తం నిర్వీర్యమై పోతుంది. కానీ ఈ దశలో కాంగ్రెస్‌తో రాజీకి ఆయన సిద్ధంగా లేడు. అటు రాజీ పడకుండా, ఇటు బయటకు వెళ్లకుండా ఎంతోకాలం వూగిసలాట నడిపే అవకాశం లేదు. కేవలం ఓదార్పు యాత్రలతో జగన్‌కు ఒరిగే రాజకీయ ప్రయోజనం ఏమీ లేదు. జనం చపల చిత్తులు. ఈ రోజు ఒకరికి నీరాజనం పట్టారని, మూడేళ్ల తర్వాత కూడా వారిలో అదే అభిప్రాయం వుంటుందనుకోవడం భ్రమ. మొత్తానికి తన తొందరపాటు తనంతో అయోమయంలో పడిపోయాడు జగన్. ఈ దశలో ఆయన ఏ దారి ఎంచుకొన్నా నష్టమే తప్ప లాభం వుండదన్నది నిజం.

నెల్లూరుముచ్చట్లు

3వ పేజీ కొరవ

లని డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. నాయకులు నగరంలో అభివృద్ధి గురించి ఎంతో జరిగినట్లు గొప్పలు చెప్పుకొంటున్నారని, నిజానికి అభివృద్ధి ఏమాత్రం అంతగా జరగలేదన్నారు. కేవలం పత్రాల్లో మాత్రమే అభివృద్ధి జరిగినట్లు, అభివృద్ధి జరుపుతున్నట్లు చూపిస్తూ లక్షలు దిగమింగుతున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు.

రోడ్డుపై ఓటరు గుర్తింపు కార్డులు

భారత పౌరులందరికీ ఓటరు గుర్తింపు వుండాలన్న లక్ష్యంతో ఎన్నికల కమిషన్ చేపట్టిన సదుద్దేశ్యాన్ని కలెక్టరేట్ ఉద్యోగులు చెత్తకుప్పపాలు చేశారు. గత ఎన్నికలలో ఓటరు గుర్తింపు కార్డుల కోసం ఊదరగొట్టి ప్రజలందరికీ ఫోటోలు తీసినా వాటిని అందించింది అతి స్వల్పం. ఎమ్మార్వో కార్యాలయం చుట్టూ తిరిగినా ప్రజలకు అవి అందలేదు. అలాంటిది కలక్టరేట్ వద్ద గల చెత్తకుప్పలో కొన్ని వందల కార్డులు పడి వుండడం నగర వాసులను ఆశ్చర్య పరచింది. వీటిలో అధిక భాగం రూరల్ నియోజకవర్గానికి చెందిన ఓటర్లవి కావడం విశేషం. దీనికి బాధ్యులెవరో గుర్తించి వారిపై కఠిన చర్యలు చేపట్టాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్‌గారిదే.

592 మందికి గురుకులాల్లో ప్రవేశం

ఎట్టకేలకు అధికారులు గురుకులాల్లో ప్రవేశానికి విద్యార్థులను ఎంపిక చేశారు. లాటరీ విధానం ద్వారా ఈ ఎంపికలు జరిగాయి. 344 మంది బాలురు, 318 మంది బాలికలను ఎంపిక చేసినట్లు అదనపు జెసి సీతారామయ్య ప్రకటించారు.

జనవాణి

2వ పేజీ కొరవ

జిల్లాగానే నామకరణం చేసేలా అవసరమైన చర్యలు తీసుకోమని ముఖ్యమంత్రి రోశయ్యగారిని అభ్యర్థిస్తున్నాను.

కెవి.చలమయ్య, నెల్లూరు

విడవలూరు పంచాయితీ భ్రష్టుపట్టింది!

విడవలూరు పంచాయితీ పాలన గూర్చి 'జమీన్‌రైతు'లో వ్రాసిన వార్త బాగుంది. విడవలూరులో ఏం జరిగినా అటు సర్పంచ్‌గాని ఇటు అధికారులు గాని పట్టించుకోవడం లేదు. గ్రామంలోని పీర్లచావిడి సెంటర్‌లోని భూమిని కొందరు దురాక్రమించారు. ఇక్కడ పక్కా కట్టడాలు కట్టను సమాయత్తమవుతున్నారు.

కెవి.అనూరాధ, విడవలూరు

పారిశుధ్యలోపంతో విజృంభిస్తున్న వ్యాధులు!

జిల్లావ్యాప్తంగా పారిశుధ్యం లోపించడంతో పలురకాల వ్యాధులు వ్యాపిస్తున్నాయి. పట్టణ ప్రజలతోపాటు గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు వ్యాధుల బారినపడి ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. డెంగ్యూ, అతిసార, మలేరియా, విష జ్వరాలు, కళ్లకలక తదితర వ్యాధులు ప్రజల్ని పట్టి పీడిస్తున్నాయి. వ్యాధులతో బాధపడుతూ ఇబ్బందులు పడుతున్నా సంబంధితశాఖల అధికారుల్లో మాత్రం స్పందన కానరావడం లేదు.



చర్యలు తీసుకుంటున్నాం

జిల్లాలో సీజనల్ వ్యాధుల బారిన పడిన ప్రజలకు వైద్య సేవ లందించేందుకు అన్ని చర్యలు చేపట్టడం జరిగింది. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్యులు, ఇతర సిబ్బంది అందుబాటులో వుండాలని ఆదేశించాం. గ్రామీణ ప్రాంతాలలో పారిశుధ్యం లోపించడంతో కొన్ని వ్యాధులు వ్యాపిస్తున్నాయి. దీనిపై గ్రామ పంచాయితీలు చర్యలు తీసుకోవాలి.

- డాక్టర్ వెంకటరమణారెడ్డి, డిఎం అండ్ హెచ్ఓ.

పారిశుధ్యం మెరుగుకోసం చర్యలు తీసుకోవాల్సిన మునిసిపాల్టీలు, గ్రామపంచాయితీలు నిర్లక్ష్యం వహిస్తున్నాయి. రోజురోజుకు పారిశుధ్యం మరింత అధ్వాన్నంగా మారడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సరైన వైద్యం అందకపోవడంతో ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి వైద్యం చేయించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు కేవలం పత్రికా ప్రకటనలకే పరిమితమైపోతున్నారే తప్ప సరైన వైద్య సదుపాయాలు కల్పించడంలో పూర్తిగా విఫలం చెందుతున్నారు.

ప్రజల ఆరోగ్యం గురించి ప్రజా ప్రతినిధులు గాని, అధికారులు గాని ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం కోట్ల రూపాయలు విడుదల చేయడంతోపాటు వైద్య సిబ్బందిని ప్రభుత్వం నియమించినప్పటికి ప్రజలకు మాత్రం వైద్యం అందడం లేదు. గ్రామీణ ప్రాంతాలలో పారిశుధ్యం మెరుగు కోసం జిల్లాపరిషత్, వైద్య ఆరోగ్యశాఖలు నిధులు కేటాయించాయి. ఈ నిధుల్ని సంబంధిత గ్రామ పంచాయితీ సర్పంచ్, కార్యదర్శులు ఖర్చు చేయాల్సి వుంటుంది.

పారిశుధ్యం మెరుగు కోసం ప్రభుత్వం కేటాయించిన నిధుల్ని ఇతర పనులకు ఖర్చు చేస్తున్నారు. గ్రామ పంచాయితీల ఆధ్వర్యంలో జరుగుతూ వున్న త్రాగునీటి సరఫరాలో మురికి నీరు చేరడంతో కలుషితం అవుతుంది. ప్రజల ఆరోగ్యం గురించి వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సిబ్బంది అందుబాటులో లేకుండా పోతున్నారు. పదిరోజుల నుంచి జిల్లావ్యాప్తంగా వ్యాధుల బారినపడి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఒక ప్రక్క రాష్ట్రప్రభుత్వం కూడా సీజనల్ వ్యాధుల పట్ల వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని పదేపదే హెచ్చరికలు చేస్తున్నా జిల్లా యంత్రాంగంలో మాత్రం ఎటువంటి చలనం కలగడం లేదు. ప్రతి సంవత్సరం ఇటువంటి వ్యాధులు వ్యాపిస్తున్న విషయం తెలిసినా కూడా ముందస్తు చర్యలు తీసుకోవడంలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యం చేస్తుంది. కూలీ, నాలీ చేసుకొని జీవించే వారు వ్యాధుల బారిన పడడంతో వారి కుటుంబపోషణ భారంగా మారింది.



నెల్లూరు నగరంలో పేరుకుపోయిన చెత్త.

మంచి కథల సంకలనం విరిసిన మల్లెలు!

డాక్టర్ మల్లెమాల వేణుగోపాలరెడ్డి వ్రాసిన పదహారు కథల సంకలనమే 'విరిసిన మల్లెలు'. రచయిత గత మూడు సంవత్సరాల నుంచి సంవత్సరానికొక కథా సంకలనం వెలువరిస్తున్నారు. ఆ ఒరవడిలో మూడవది విరిసిన మల్లెలు. రచయిత ఇంటి పేరు మల్లెమాలగా వుండడంతో ఠకీమని మల్లె మాలగా సుపరిచితులైన సినీ నిర్మాత, రచయిత ఎం.ఎస్.రెడ్డి గారు గుర్తుకొస్తారు. బంధుత్వమేమైనా వుందా అని కూడా సందేహం కలుగుతుంది. అవును సహజకవిగా పేరుగాంచిన ఎం.ఎస్.రెడ్డి గారి సోదరుడే ఈ పుస్తక రచయిత.

అందమైన ముద్రణతో తాజా బొండుమల్లెల్లా హృదయానికి హత్తుకోవాలనిపిస్తుందీ పుస్తకం. మామూలు న్యూస్ ప్రింట్‌తో 'మాబడి', 'పాఠశాల' పత్రికలు ముద్రించి నడుపుకునే విజయవాణి ప్రింటర్స్‌కు అవకాశమూ, అవసరమూ వస్తే అందంగానూ ముద్రించగలమని ఋజువు చేసుకున్నారీ ప్రచురణతో.

సంకలనంలోని పదహారు కథల్లో తొమ్మిది కథలు ఇప్పటికే వివిధ పత్రికల్లో ప్రచురించబడ్డవి కాగా, మిగిలిన ఏడు కథలు సంకలనం పూర్తి చేయడానికిగాను వ్రాసినవి. ప్రతి సంవత్సరం సంకలనం తేవాలన్న తాపత్రయంతోనూ, సంకలనంలో పదహారు కథలు వుండాలన్న స్వయం నియమంతోనూ, హడావుడిగా రాయడం వల్ల ఈ కథ ఇంకా బాగా చెప్పి ఉండొచ్చే అని కొన్ని కథలు చదువుతున్నప్పుడు అనిపిస్తుంది. మంచి బొండు మల్లెలు దండ కట్టడంలోనే హడావుడి అయ్యింది. ఎన్నుకొన్నది మంచి కథాంశమైనా హడావుడిలో బిగి తగ్గిన అల్లిక వల్ల కొన్ని కథలు రక్తి కట్టించలేక పోయాయి. మరికొన్ని కథలకి మరింత బిగువైన ముగింపునీ ఇవ్వలేక పోయాయి.

ఇవాళ వస్తున్న తెలుగు కథాసాహిత్యానికి కథాంశమే ప్రధాన లోపం. కథలో బలమైన కథాంశం వుండాలంటే రచయితకు జీవితానుభవం, దృక్పథం, పరిశీలన, నిరంతర సామాజిక జీవితం తప్పని సరి. అయితే మల్లెమాల వేణుగోపాలరెడ్డిలో ఇవన్నీ పుష్కలంగా వున్నాయని తాను ఆవిష్కరించిన కథాంశాలు స్పష్టంగా చెప్తున్నాయి. అయితే కథనానికి ఇవ్వాల్సిన సమయం, ప్రాముఖ్యం, ముగింపుపై చూపాల్సిన శ్రద్ధ శ్రమ, హడావుడిలో హరించుకుపోయాయి. రచయిత తన ముందుమాటలో 'అర్జెంటుగా కథలు వ్రాస్తే ఎలా తయారవుతాయో ప్రయత్నించి చూశాను' అన్నాడు. ఇదిగో ఇలా తయారయ్యాయి.

ఎక్కువ భాగం కథల్ని ప్రథమ పురుషలోనే చెప్పడం ఒక విశేషమయితే భార్య పాత్ర, కథలో వచ్చిన దగ్గరల్లా నిజజీవితంలో తన భార్య వరలక్ష్మి పేరునే ఆ పాత్రకు పెట్టడం మరీ విశేషం. అయితే కథ ఇక్కడితో ఆగకుండా, పిల్లల పాత్రలకు తమ మనుమళ్లు, మనుమరాండ్రుల పేర్లు, బంధువుల పేర్లు, తన కుటుంబంలో జరిగే విశేషాల్ని సజీవంగా, కథగా మలచాలనే కుటుంబ ప్రేమ, కొన్ని కథల్ని డైరీల స్థాయికి దిగజార్చింది.

'అప్రమేయుడు' కథలో వినాయకచవితి ఉత్సవాలు రాయలసీమ గ్రామీణ ప్రాంతాల్లో జరిగే తీరును పూసగుచ్చినట్లుగా వివరించడం బాగుంది. ముస్లింలు, హిందువులు కలసి నిమజ్జనం ఊరేగింపు జరుపుకోవడం, వినాయకుడు మావాడు, ఉత్సవమూ మాదే అని విర్రవీగే మతఛాందసులకు కనువిప్పు కలిగించేలా కథనం సాగిన తీరు ప్రశంసనీయం. అలాగే రచయిత వృత్తిరీత్యా డాక్టరవడంతో 'ఔట్ సోర్సింగ్' కథ రక్తి కట్టింది. సర్రోగేట్ మదర్స్ - గర్భసంచిని అద్దెకిచ్చే తల్లులు కథాంశంగా నడిపిన కథలో వైద్య విషయాల్ని సులభంగా వివరిస్తూ, తన గర్భాశయాన్ని అద్దెకిచ్చి మరొకరి కోసం పిల్లల్ని కనే తల్లుల వ్యక్తిత్వాన్ని, ఉన్నతత్వాన్ని కీర్తిస్తూ, వారి పక్షాన రచయిత నిలబడి చేసిన వాదన చాలా బాగుంది.

వాస్తు, అశాస్త్రీయాలైన విశ్వాసాలపై రచయిత చేసిన ధర్మ, తర్క యుద్ధమే 'నమ్మకం మీద దుమ్ము' కథ. వాస్తులో లోపం అంటూ తమ సమయాన్ని, మానసిక ప్రశాంతతనూ కోల్పోతున్న ప్రతి ఒక్కరూ చదివి తీరాల్సిన కథయిది. "దూకుడు గళ్లు" కథలో రాయలసీమ జీవనాదం వినిపించిన విధం బాగుంది. పాఠకుడ్ని రాయలసీమ ఎండల్లో, దుమ్ము రోడ్లలో, క్రిక్కిరిసిన ఆర్టీసి బస్సుల్లో త్రిప్పి, ఆప్యాయత రంగరించి పోసిన రాయలసీమ యాస భాషలో పలకరించడం హృద్యంగా వుంది.

పుస్తకసమీక్ష

విరిసిన మల్లెలు

రచయిత : **డా॥ మల్లెమాల వేణుగోపాలరెడ్డి**

సమీక్షకుడు : **చింతల జాషువా**

వెల : **60/-లు**

ప్రతులకు

డా॥ మల్లెమాల వేణుగోపాలరెడ్డి
రోడ్ నెం.3, సింహపురి కాలనీ
కడప - 516002

పారిశ్రామికవేత్తలు తమ పరిశ్రమల్లో సరైన భద్రతా చర్యలు చేపట్టని కారణంగా ప్రమాదాల్లో మరణించే కార్మికుల మరణాలను "పత్రికలకు వాణిజ్య ప్రకటనల్చి, విలేకరులకు విందులిచ్చి, లేబర్ యూనియన్ల జేబులు తడిపి" సమాధి చేస్తారంటూ ఇండస్ట్రియల్ వయలెన్స్‌పై నిరసన వెల్లడించిందీ కథలోనే.

ఇక "పాపం... ఫాతిమా" కథను సంకలనానికే మకుటంగా చెప్పవచ్చు. కరుణరసాన్ని కథా చట్రంలో బంధించి, జీవితంలోని ఎగుడు దిగుళ్లనూ, ప్రౌఢ, మరణాల మధ్య జీవన సంఘర్షణనూ, ఇంత విశాల జనసమ్మర్ధ ప్రపంచంలో మనిషి ఒక్కడుగా మిగిలిపోతున్న వైనాన్ని, 'ఫాతిమా' పాత్రలో ఆవిష్కరించిన పద్ధతి అద్భుతం. వేణుగోపాల్ మీ కృషి ప్రశంసనీయం. హడావుడిని వదిలిపెట్టి, కాస్త వ్యవధి చేసుకొని, మీరు మరిన్ని మంచి కథలు రాయాలని, మరిన్ని సంకలనాలు మీ నుంచి రావాలని మా ఆశ.

ఈ సంకలనానికి త్రిభాషా సాహితీవేత్త, కోడూరు పుల్లారెడ్డి వ్రాసిన 'ఆప్తవాక్యం' బాగుంది. యువత విధిగా చదవాల్సిన ఆప్తవాక్యాలివి.

రాత్రిపూట సూర్యుడు కనిపించడం లేదని కన్నీరు కారుస్తుంటే చివరికి నక్షత్రాలు కూడా కనిపించకుండా పోతాయి. ఒక పని, ఒక నిద్ర, కొంచెం ప్రేమ, అంతే! అదే జీవితం! చక్కని అవకాశం చేజారిపోయిందని అదే పనిగా కుమిలి పోవద్దు. కన్నీళ్లతో మసకబారిన కళ్లు మరో అవకాశాన్ని గుర్తించలేవు. దేవుడు యింటింటికీ దయచేయలేక తల్లిని సృష్టించాడు. ఇలాంటి జీవనసత్యాలు కోకొల్లలుగా వున్న 'ఆప్తవాక్యం' ఈ పుస్తకానికి కంఠహారంగా ప్రకాశించింది. ఇక ఆచార్య కొలకలూరి ఇనాక్ వ్రాసిన 'ఆత్మీయ వాక్యం', 'విరిసిన మల్లెలు'కు సమగ్రతను చేకూర్చింది. 'సమాజం పట్ల ఉండవలసిన, ఉండదగిన ఆరోగ్యకరమైన దృష్టిని కలిగించే కథానికలు ఈ 'విరిసిన మల్లెలు!'. మానవతా హృదయ వేదనలు వాస్తవికంగా చిత్రించిన మంచి కథలు 'మల్లెమాల కథలు' అంటాడు ఇనాక్.

● జగన్‌వైపు మొగ్గి సాహసం చేస్తున్న

ఎమ్పీ రాజమోహన్‌రెడ్డి




నెల్లూరు లోక్‌సభ సభ్యుడు మేకపాటి రాజమోహన్ రెడ్డి తాను జగన్ పక్షంగానే వుండ బోతున్నట్లు ప్రకటించాడు. మొదట నుంచి ఆయన మొగ్గ అటువైపే వుంది. అయితే అధిష్టానం ఒక స్పష్టమైన వైఖరి తీసుకొన్న తర్వాత ఆయన ఆలోచనలో కూడా మార్పు ఉండవచ్చునని భావించారు అందరూ. ఆ అంచనాలు పటా పంచలు చేశాడు రాజమోహన్‌రెడ్డి.

సాహసంతో కూడిన నిర్ణయం ఇది. జగన్‌తో ఆయనకు ఎక్కడో ఏదో తెలియని బంధం వున్నట్లుంది. రాజమోహన్‌రెడ్డి కుమారుడు గౌతమ్‌రెడ్డి, జగన్ స్నేహితులట. ఇద్దరి మధ్య భారీ మొత్తంలో నగదు లావాదేవీలు వున్నట్లు చెప్తున్నారు. ఇప్పుడు జగన్‌తో పేచీపెట్టుకొంటే అంత మొత్తం వెంటనే తిరిగి ఇవ్వడం సాధ్యం కాదు కాబట్టి, తన తండ్రిని ఈ నిర్ణయానికి ఒప్పించాడని చెప్తున్నారు. అయితే ఇందులో నిజం ఎంత ధృవీకరించలేము. కడప – కర్నూల్ రోడ్ పని గురించి చెప్తున్నారు. దాదాపు 700 కోట్ల రూపాయల ఉచిత నిధులు ఇచ్చాడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఈ పనికోసం. ఆ పనిలో జగన్‌కు కూడా వాటా వుందని వినికిడి. జగన్ సహకారం లేకుండా ఆ పని పూర్తి చేయడం సాధ్యం కాదు. రాజమోహన్ రెడ్డి నిర్ణయానికి అదీ ఒక కారణం కావచ్చునని ఒక అంచనా.

ఆయన మాత్రం ఈ వ్యాపార సంబంధాలను ఒప్పు కోవడం లేదు. నాకు ఆంధ్రప్రదేశ్‌లో కంటే దేశంలోని ఇతర ప్రాంతాలలో ఎక్కువ పనులున్నాయి. వ్యాపార అవసరమే అయితే, జగన్‌తో కంటే కాంగ్రెస్ అధిష్టానంతోనే అవసరం ఎక్కువ. వైఎస్ కుమారుడిగా జగన్‌కు పార్టీ పెత్తనం చేసే హక్కు వుంది. జగన్‌కు వున్న ప్రజాకర్షణతో రేపటి ఎన్నికలలో కూడా పార్టీ గెలుస్తుంది. జగన్ లేకుండా రాష్ట్ర కాంగ్రెస్‌ను నడిపించే నాయకుడు మరెవ్వరూ లేరు కాబట్టే నేను జగన్‌ను సమర్థిస్తున్నానని చెప్తున్నాడు రాజమోహన్‌రెడ్డి. రాజమోహన్ రెడ్డికి, రాజశేఖర్‌రెడ్డి కుటుంబానికి రాజకీయంగా దగ్గరి సం బంధాలు లేవు. మొన్నటి ఎన్నికలలోనే వారు దగ్గరయ్యారు. మాగుంట సుబ్బరామరెడ్డితో ఒంగోలు ఎమ్పీగా పోటీచేసిన ప్పుడు వైఎస్ మనుషులు ఉదయగిరికి వచ్చి, మేకపాటి సోద రులను ఒక ఆట ఆడించారు. అప్పట్లో వైఎస్ పట్ల మేకపాటికి శత్రుత్వ భావం వుండేది. అందువల్లనే ఆయన నిర్ణయం రాజ కీయ ప్రేరేపితం అంటే నమ్మడం వీలు కావడం లేదు.

అయితే నెల్లూరు జిల్లాలో ఈ క్షణం వరకు రాజ



మోహన్‌రెడ్డితో కలిసి ప్రయాణం చేసే ఎమ్మెల్యేలు ఎవరూ కనిపించడం లేదు. ఆయన సోదరుడు మేకపాటి శేఖర్‌రెడ్డికి తప్పదు కాబట్టి వెంట వుంటాడు. కానీ ఇంతవరకు జిల్లా రాజకీయాలలో ఒక జట్టుగా వున్న ఆనం సోదరులు మాత్రం జగన్‌తో వెళ్లే ఆలో చన చేయడం లేదు. ఆదాల ప్రభాకర్‌రెడ్డి కూడా అంతే. జిల్లా పరిషత్ చైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి సైతం అధికార కాంగ్రెస్‌లోనే కొనసాగాలన్న నిర్ణయంతో వున్నాడు. మొన్నటి వరకు పనబాక క్రిష్ణయ్యకు జగన్ పట్ల మోజు వున్న మాట నిజం. కానీ సోనియా కన్నెర్ర చేసిందన్న వార్తతో ఆయన కుదురుగా వుంటున్నాడు. నెలవల సుబ్ర హ్మణ్యం అటు ఇటు ఊగిసలాట ఆడుతున్నాడు. కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాత్రం జగన్ జై అంటున్నాడు. జగన్ నెల్లూరు పర్యటనకు వచ్చే వరకు రాజమోహన్‌రెడ్డి ఇదే మాట మీద నిలబడితే ఆయన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాత్రమే కలిసి వుంటారు. ఈలోగా మనసు మార్చుకొంటే జగన్ తరపున నాయకుడు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాత్రమే.



ఉత్తరక్రియలు

ఆప్యాయతానురాగాల అమృతమూర్తి,
తన మంచితనంతో మా అందరి హృదయాలలో చెరగని ముద్రవేసుకున్న
మా సోదరుడు శ్రీ పెనుబల్లి కోదండరామిరెడ్డి గారు
తేది 14-08-2010 శనివారం నాడు స్వర్గస్తులైనారు.
వారి ఆత్మకు శాంతిని కలుగజేయమని
శోకతప్త హృదయాలతో భగవంతుని ప్రార్థిస్తున్నాము.

సోదరులు
పెనుబల్లి రమణారెడ్డి
పెనుబల్లి చంద్రశేఖర్‌రెడ్డి
పెనుబల్లి శ్రీనివాసులురెడ్డి
పెనుబల్లి పిచ్చిరెడ్డి
మరియు కుటుంబ సభ్యులు

శ్రీ పెనుబల్లి కోదండరామిరెడ్డి గారు
కాంట్రాక్టర్, మాదరాజుగూడూరు.

ZR @ 9848966163

ఉత్తరక్రియలు : తేది 26-08-2010 గురువారం నాడు "పెద్దకర్మ" నెల్లూరు జిల్లా, నెల్లూరు రూరల్ మండలం, మాదరాజుగూడూరు గ్రామంలోని మా స్వగృహము నందు జరుగును.
బంధుమిత్రులకు తెలియజేయడమైనది. ఫోన్ : 94410 27239, 99858 56085

Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore.